
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కృష్ణా జిల్లా వార్తలు
గురువారం 1 ఫిబ్రవరి 2024



వందనాలమ్మా..!

గుణదల మేరీమాత పుణ్యక్షేత్రానికి నూరేళ్లు

ఆ కొండ ఆధ్యాత్మికతకు ఆలవాలం. మతసామరస్యానికి నిలయం. అది ఒక్క కొండ మాత్రమే కాదు.. ఖండాంతరాలకు విస్తరించిన మనదేశ ఖ్యాతి. దక్షిణ భారతంలో రెండో అతిపెద్ద మరియ మాత గుడి. ఇది నిన్న.. మొన్నటి కథ కాదు. వందేళ్ల నాడు పురుడు పోసుకున్న చరిత్ర. బ్రిటీష్ పాలనలో పునాది వేసుకున్న ఈ పుణ్యక్షేత్రం నూరు వసంతాలను పూర్తి చేసుకున్న సందర్భంగా శతాబ్ది ఉత్సవాలను వేడుకగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేశారు. ఈనెల 9, 10, 11 తేదీల్లో మేరీమాత తిరునాళ్ల ప్రారంభ సూచికగా నవదిన ప్రార్థనలకు శ్రీకారం చుట్టారు. వందేళ్ల గుర్తుగా ఈ ఏడాది మరింత వైభవంగా ఉత్సవాలు నిర్వహించేందుకు సర్వం సిద్ధమైంది.



దక్షిణ భారతంలో రెండో అతిపెద్ద మరియ క్షేత్రం

- 1924లో ఏర్పాటుచేసిన బ్రిటీష్ ప్రభుత్వం
- 1971లో పూర్తిస్థాయి చర్చిగా అవతరణ
- 1947 నుంచి ఏటా మేరీమాత ఉత్సవాలు
- ఘనంగా నవదిన ప్రార్థనలు ప్రారంభం
- ఈనెల 9, 10, 11 తేదీల్లో తిరునాళ్లు



(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : దక్షిణాదిలో ఉన్న అతిపెద్ద క్రైస్తవ పుణ్యక్షేత్రాల్లో గుణదల రెండోది. తమిళనాడులోని వేళంగిణీ మాత ఆలయం తర్వాత అంతటి ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇక్కడ వెలసిన లూర్థుమాత విగ్రహం ఫ్రాన్స్ దేశంలోని లూర్థు నగరంలో ఉన్న మేరీమాత విగ్రహాన్ని పోలి ఉంటుంది. ఈ విగ్రహం ఒక గుహలో ఉంటుంది. ఏటా ఫిబ్రవరి 9 నుంచి 11వ తేదీ వరకు ఉత్సవాలను నిర్వహిస్తారు. ఫ్రాన్స్‌లోని లూర్థు నగర శివారులో ఉన్న కొండ దిగువన వంట చెరుకు ఏరుకోవడానికి బెర్నడెట్ అనే బాలిక వెళ్లింది. ఆమెకు మేరీమాత ఒక స్త్రీ రూపంలో కనిపించి మాట్లాడింది. ఈ విషయాన్ని ఆ బాలిక తల్లిదండ్రులకు చెప్పింది. మేరీమాత బాలికకు కనిపించిన ఫిబ్రవరి 11వ తేదీని గుర్తు చేసుకుంటూ అక్కడ ఏటా ఉత్సవాలను నిర్వహిస్తారు.


శిఖరాగ్రాన శిలువ

అదే మాదిరిగా గుణదల పుణ్యక్షేత్రంలో 1924, ఫిబ్రవరి 11వ తేదీ నుంచి ఉత్సవాలను ప్రారం భించారు. అదే సంవత్సరంలో బ్రిటీష్ ప్రభుత్వం గుణదలలో సెయింట్ జోసెఫ్ ఇన్‌స్టిట్యూట్ అనే అనాథ శరణాలయం ఏర్పాటు చేసింది. ఇటలీకి చెందిన ఫాదర్ పి.ఆర్లాటి దీనికి రెక్టార్‌గా నియ మితుల య్యారు. ఆయనే గుణదల కొండపై ప్రకృతిసిద్ధంగా ఏర్పడిన గుహలో మేరీమాత విగ్రహాన్ని ఏర్పాటు చేయించారు. అప్పుడే మేరీమాత ఆలయానికి అంకురార్పణ జరిగింది. కాలక్రమంలో ఈ క్షేత్రానికి జనాదరణ పెరిగింది. దీంతో 1971వ సంవత్సరంలో పూర్తిస్థాయిలో చర్చిని నిర్మించారు. అప్పటి నుంచి ఇక్కడికి క్యాథలిక్‌లు, అనాథ బాలలు, క్రైస్తవ మత కన్యలు వచ్చి మరియమ్మ ఉత్సవాలను నిర్వహించడం మొదలుపెట్టారు. 1947వ సంవత్సరంలో విజయవాడలో స్థిరపడిన తమిళనాడుకు చెందిన క్యాథలిక్‌లు, ఫాదర్ ఆర్లాటి ఆధ్వర్యంలో కొండపై ఆరోగ్యమాతను ప్రతిష్ఠించి, గుహ ప్రాంగణంలో విశాలమైన దివ్య బలిపీఠాన్ని నిర్మించారు.

వాస్తవానికి 1946వ సంవత్సరంలో అప్పటి ఫాదర్ బియాంకి, జిపిడా, బ్రదర్ బెర్తోలి, ఎల్‌క్రిప్పా గుణదల కొండపై మరియమ్మ విగ్రహాన్ని ప్రతిష్ఠించి, గుహ వద్ద భారీ బలిపీఠాన్ని నిర్మించాలని భావించారు. ఇందులో భాగంగా గుహ వద్ద శిలను తొలగించే పనులకు శ్రీకారం చుట్టారు. 1974లో ఫాదర్ బియాంకి అత్యవసరంగా ఇటలీకి వెళ్లాల్సి వచ్చింది. తర్వాత కురిసిన భారీ వర్షాలకు బలిపీఠం నిర్మాణాలు కొట్టుకుపోయాయి. ఫాదర్లు ఎక్కడా నిరుత్సాహం చెందకుండా బియాంకి తిరిగి వచ్చే సమయానికి బలిపీఠం పనులు పూర్తి చేయిం చారు. 1947లో ఇక్కడ భారీస్థాయిలో మేరీమాత ఉత్సవాలు నిర్వహించారు. కొండపై శిలువను ప్రతిష్ఠించారు. కాలక్రమంలో భక్తులు అక్కడికి వెళ్లడానికి మెట్లమార్గాన్ని అభివృద్ధి చేశారు. ఈ కాలిబాటలో క్రైస్తవులు పవిత్రంగా భావించే వయాడోలరోసా అనే 14 స్థలాల విశిష్టతను తెలియజేసే ఏసుక్రీస్తు జీవిత ఘట్టాలను ఏర్పాటు చేశారు.

పోలీస్.. పక్షపాతం

అధికార పార్టీకి అనుకూలంగా గుడివాడ పోలీసుల తీరు


2022లో టీడీపీ నాయకులపై లాఠీచార్జి చేస్తున్న అప్పటి వన్‌టౌన్ సీఐ గోవిందరాజు (ఫైల్)

అధికార పార్టీ అయితే చాలు.. దాడికి దిగినా పెద్దగా పట్టించుకోరు.. కార్లను ధ్వంసం చేసినా కదలరు, మెదలరు.. కార్యాలయాలపై కొట్లాటకొచ్చినా చూస్తూ ఊరుకుంటారు.. రెచ్చగొట్టినా ఎందుకులే.. అని వదిలేస్తారు.. ప్రాణాలు తీసేందుకొచ్చినా పోనీలే.. అని పక్కకు తప్పుకొంటారు.. గుడివాడలో ఎమ్మెల్యే కొడాలి నాని అడుగులకు మడుగులొత్తుతూ, ప్రతిపక్షంపై పగ సాధిస్తున్నారు పోలీసులు. 2022లో అమరావతి పాదయాత్రికులపై దాడులు మొదలు.. మంగళవారం రాత్రి జరిగిన ఫ్లెక్సీల వార్ వరకూ ప్రతిచోటా పోలీసుల పక్షపాత ధోరణి ప్రతిపక్ష టీడీపీ నాయకులు, కార్యకర్తలకు ప్రాణసంకటంగా మారింది. వైసీపీ అయితే చూసీచూడనట్టుగా ఉండటం, టీడీపీ అయితే లాఠీచార్జీలకు పాల్పడటం పరిపాటిగా మారింది.


రావి కార్యాలయంపై దాడికి కర్రలు, రాడ్లతో వైసీపీ మూకలు (ఫైల్)

అడుగడుగునా టీడీపీ కార్యక్రమాలకు అడ్డు

- దాడులకు దిగుతున్న ఎమ్మెల్యే కొడాలి నాని అనుచరులు
- పట్టనట్టుగా వ్యవహరిస్తున్న పోలీసులు
- రివర్స్‌గా టీడీపీ నాయకులపైనే కేసులు
- 2022లో అమరావతి రైతులపై దాడితో మొదలు
- గతరాత్రి ఫ్లెక్సీల వార్ వరకూ ఏకపక్షమే..
- వైసీపీ శ్రేణులను వదిలి.. టీడీపీ నేతలపై రివెంజ్

(విజయవాడ-ఆంధ్రజ్యోతి/గుడివాడ) : గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని ఆదేశాలను తూచా తప్పకుండా పాటిస్తూ గుడివాడ పోలీసులు స్వామిభక్తి చాటుకుంటున్నారు. వైసీపీ అల్లరిమూకలు, నాని ముఖ్య అనుచరులు టీడీపీ కార్యాలయాలు, వాహనాలు, ర్యాలీలపై దాడులకు తెగబడుతున్నా పోలీసులకు కనిపించవు. ఏమీ చేయకున్నా టీడీపీ నాయకులపై అక్రమ కేసులు బనాయించడం పరిపాటిగా మారింది. 2022లో అమరావతి పాదయాత్రికులపై దాడులతో మొదలుపెట్టి ఈనెల 18వ తేదీ ఎన్టీఆర్ వర్ధంతి, మంగళవారం రాత్రి జరిగిన ఫ్లెక్సీల వివాదం వరకూ పోలీసులు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.

అడుగడుగునా దాడులే..

- 2022లో శాంతియుతంగా సాగుతున్న అమరావతి మహాపాదయాత్రికులపై వైసీపీ నాయకులు అసభ్యంగా ప్రవర్తించి కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. ఈ వివాదంలో పోలీసులు ఒక్కరిపై కేసు నమోదు చేయలేదు.
- ఎమ్మెల్యే కొడాలి నాని ఆధ్వర్యంలో 2022 సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన కేసినో వ్యవహారంలో టీడీపీ నియమించిన నిజనిర్ధారణ కమిటీపై ఏకంగా ఎమ్మెల్యే ముఖ్య అనుచరులు దుక్కిపాటి శశిభూషణ్, మెరుగుమాల కాళీ తదితరులు దాడిచేసి బొండా ఉమా కారును ధ్వంసం చేశారు. ఈ వ్యవహారంలో కనీసం ఒక్క వైసీపీ నాయకుడిపై కేసు లేదు.
- 2022లో క్రిస్మస్ పర్వదినాన మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు హత్యకు వైసీపీ నాయకుడు మెరుగుమాల కాళీ తన అనుచరులతో యత్నించినా పోలీసులు చూస్తూ ఉండిపోయారు. పెట్రోలు సంచులతో గడ్డం గ్యాంగ్ వీరంగం సృష్టించింది. పాత్రికేయులపై కూడా దాడి జరిగింది. పోలీసులకు విషయం తెలిసినా పరిస్థితిని సీరియస్‌గా తీసుకోలేదు. టీడీపీ శ్రేణులపై వన్‌టౌన్ సీఐ గోవిందరాజు తన ప్రతాపం చూపారు.
- 2023, జనవరి 18వ తేదీన ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా స్థానిక ఎన్టీఆర్ స్టేడియానికి రావి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పాదయాత్ర చేరుకోగానే, జూనియర్ ఎన్టీఆర్ ఫొటోలతో వైసీపీ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించుకుంటూ వచ్చారు. దీంతో ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. మాజీ మంత్రి కొడాలి నాని ముఖ్య అనుచరులు గుత్తా నాని, యార్లగడ్డ సత్యభూషణ్, యార్లగడ్డ మురళీకృష్ణ, ఆట్లూరి శశి, శొంఠి శశి తదితరులు టీడీపీ పట్టణాధ్యక్షుడు దింట్యాల రాంబాబుతో వాగ్వివాదానికి దిగారు. అదే సమయంలో కొందరు వైసీపీ కార్యకర్తలు గుడ్లవల్లేరుకు చెందిన టీడీపీ

- మిగతా 6లో

మహిళల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ

నూతన ఎస్పీ అద్నాన్ నయీం అస్మీ


నూతన ఎస్పీగా బాధ్యతలు స్వీకరిస్తున్న అస్మీ

మచిలీపట్నం టౌన్ , జనవరి 31 : శాంతిభద్రతలతో పాటు మహిళల భద్రత పెంచడంపై ప్రత్యేక దృష్టి సారిస్తానని ఎస్పీగా పదవీ బాధ్యతలు చేపట్టిన అద్నాన్ నయీం అస్మీ అన్నారు. బుధవారం నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆయన మీడియాతో మాట్లాడారు. సిబ్బంది సంక్షేమంపై దృష్టిసారిస్తానన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా, సక్రమంగా నిర్వహించేందుకు సిబ్బందికి తగిన సూచనలు ఇస్తానన్నారు. అందుకు అందరూ సహకరించాలని కోరారు. ట్రైనింగ్ ఎస్పీగా కృష్ణాజిల్లాలో శిక్షణ పొందానని, నేర రహిత జిల్లాగా మారుస్తానని పేర్కొన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు 24 గంటలు అందుబాటులో ఉంటానన్నారు. చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ వ్యవస్థను కొనసాగిస్తానన్నారు. అనంతరం ఎస్పీ.. కలెక్టర్ రాజాబాబును, జిల్లా జడ్జి అరుణసారికను మర్యాద పూర్వకంగా కలిశారు. ఎస్పీని ఏఆర్ఎస్పీ ప్రసాద్ డీఎస్పీలు, సీఐలు మర్యాదపూర్వకంగా కలిశారు.

మహిళలకు ఆసరా తిప్పలు

చెక్కుల పంపిణీలో తొక్కిసలాట, కింద పడిపోయిన వృద్ధులు

మోపిదేవి జిల్లా పరిషత్ స్కూల్లో గందరగోళం

- 6లో..

ఆయువు తీసిన ఆటో

తండ్రి ఆటో కిందే పడి తనయుడు మృతి

- రెక్కాడితే కానీ డొక్కాడని జీవితం
- ఆటోపైనే 20 ఏళ్లుగా జీవనాధారం
- చిన్నారిని చిదిమేసిన ఆటో
- దుఃఖసాగరంలో మోటూరు



ప్రమాదానికి కారణమైన ఆటో ఇదే.. (ఇన్‌సెట్‌లో) చిన్నారి రిషిక్ (ఫైల్)

గుడివాడ రూరల్, జనవరి 31 : రెక్కాడితే గానీ డొక్కాడని కుటుంబం. అయినా ఆనందంగా సాగిపోతున్న సంసార సాగరం. ముద్దు ముద్దు మాటలు చెప్పే ఓ బాబు, మురిపెంగా చూసుకుంటున్న ఓ పాప. ఆటో వేయగా వచ్చిన డబ్బుతో ఆ దంపతులు ఏ చీకూ చింత లేకుండా ఉన్నదాంట్లోనే సంతోషంగా బతుకుతున్నారు. విధికి కన్నుకుట్టిందో ఏమో. ఆటో రూపంలో వచ్చి ఆ ఆనందాన్ని దూరం చేసింది. ఆ కుటుంబాన్ని దుఃఖసాగరంలో ముంచేసింది. గుడివాడ రూరల్ మండలం మోటూరు గ్రామానికి చెందిన నాలుగేళ్ల బాలుడు వరిగంజి రిషిక్ మృతితో ఆ కుటుంబంలో విషాద ఛాయలు అలముకున్నాయి. తండ్రి ఆటో కింద పడి రిషిక్ మృతిచెందిన ఘటనను వారు జీర్ణించుకోలేకపోతున్నారు. వివరాల్లోకి వెళితే.. వరిగంజి మురళీకృష్ణ (35)కు 20 ఏళ్ల నుంచి ఆటోనే జీవనాధారం. రిషిత (30)తో వివాహమైనా, ఇద్దరు పిల్లలు పుట్టినా ఆటో నడపగా వచ్చిన డబ్బుతోనే జీవిస్తున్నారు. రోజూ మాదిరిగానే మురళీకృష్ణ ఆటో నడిపి మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వచ్చాడు. 3 గంటల సమయంలో తిరిగి ఆటో తీసి ఇంజన్ స్టార్ట్ చేశాడు. అయితే, కుమారుడు వెనుకే ఉన్న విషయాన్ని మురళీకృష్ణ గమనించలేదు. ఆటోను వెనక్కి నడపగా, అక్కడే ఆడుకుంటున్న రిషిక్‌పైకి ఆటో చక్రం ఎక్కింది. వెంటనే గమనించిన కుటుంబసభ్యులు గుడివాడ ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. అల్లారుముద్దుగా పెంచుకున్న కుమారుడు కళ్లముందే విగతజీవిగా మారడంతో ఏరియా ఆసుపత్రి వద్ద తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా రోదించారు. గ్రామస్థులు, కుటుంబసభ్యులు ఓదారుస్తున్నప్పటికీ వారి రోదన ఆపలేదు.

వైసీపీ మచిలీపట్నం ఎంపీ అభ్యర్థిగా సింహాద్రి రమేశ్

అవనిగడ్డ ఎమ్మెల్యే అభ్యర్థిగా సింహాద్రి చంద్రశేఖర్



సింహాద్రి చంద్రశేఖర్, సింహాద్రి రమేశ్

(మచిలీపట్నం-ఆంధ్రజ్యోతి) : కృష్ణాజిల్లాలో అభ్యర్థుల ప్రకటనకు వైసీపీ తెరదించింది. మచిలీపట్నం పార్లమెంట్ సహా దాని పరిధిలోని అన్ని స్థానాలకు దాదాపు అభ్యర్థులను ఖరారు చేసింది. మచిలీపట్నం ఎంపీ అభ్యర్థిగా అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేశ్‌ను ప్రకటించింది. మచిలీపట్నం నుంచి పేర్ని కిట్టు, పెడన నుంచి ఉప్పాల రాము, పెనమలూరు నుంచి జోగి రమేశ్ పేర్లను ఇప్పటికే ప్రకటించగా, అవనిగడ్డ నుంచి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్ పేరును బుధవారం ప్రకటించారు. పామర్రు, గన్నవరం, గుడివాడ స్థానాలకు అభ్యర్థులను అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. అయితే, గుడివాడ నుంచి కొడాలి నాని పేరు లాంఛనమే. గన్నవరం నుంచి వంశీ పోటీపై అనుమానాలు ఉన్నా చివరికి ఆయనే అభ్యర్థిగా ఉండొచ్చని పార్టీ శ్రేణుల మాట. పార్టీ నుంచి ఆర్థిక దన్ను కోసమే వంశీ ఊగిసలాట ధోరణి కనబరుస్తున్నారని వారు చెబుతున్నారు. పామర్రు నుంచి కైలే అనీల్ విషయంలోనూ మార్పు ఉండకపోవచ్చని సమాచారం.

అనూహ్యంగా..

అవనిగడ్డ అభ్యర్థిగా డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్ అనూహ్యంగా తెరపైకి వచ్చారు. ప్రముఖ టీడీపీ నాయకుడు సింహాద్రి సత్యనారాయణ తనయుడిగా, ప్రముఖ కేన్సర్ వైద్యుడిగా దివిసీమవాసులకు చంద్రశేఖర్ సుపరిచితులు. సౌమ్యుడిగా పేరొంది.. రాజకీయాలకు దూరంగా ఉండే సత్యనారాయణ వైసీపీ నుంచి రాజకీయ అరంగేట్రం చేస్తున్నారు.

ప్రత్యామ్నాయం లేక..

మచిలీపట్నం ఎంపీగా సింహాద్రి రమేశ్‌ను బరిలోకి దింపడంపై వైసీపీ శ్రేణులే పెదవి విరుస్తున్నాయి. అవనిగడ్డ ఎమ్మెల్యేగా రమేశ్ ఎన్నో అవినీతి ఆరోపణలను ఎదుర్కొన్నారు. ఆయన దుందుడుకు వైఖరి పలుమార్లు వివాదాస్పదమైంది. ఈ పరిస్థితుల్లో ఆయన్ను ఎంపీగా బరిలోకి దింపడంపై విస్మయం వ్యక్తమవుతోంది. ఊహించని రీతిలో బాలశౌరి వైసీపీకి గుడ్‌బై చెప్పడంతో ప్రత్యామ్నాయం కోసం వైసీపీ వెతుకులాట ప్రారంభించింది. పలు పేర్లు పరిశీలనలోకి వచ్చినా ఎవరూ మచిలీపట్నం నుంచి పోటీకి సుముఖత చూపలేదు. ప్రత్యామ్నాయం లేక రమేశ్ వైపు వైసీపీ పెద్దలు మొగ్గు చూపారని సమాచారం.



అల్పాహారం, బిస్కెట్ ప్యాకెట్ల కోసం తోసుకుంటున్న మహిళలు

మహిళలకు ఆసరా తిప్పలు

» చెక్కుల పంపిణీలో తొక్కిసలాట, కింద పడిపోయిన వృద్ధులు

మోపిదేవి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా డ్వాక్రా రుణమాఫీ, ఆసరా చెక్కుల పంపిణీ సభలో కనీస వసతులు లేక మహిళలు వాగ్వాదానికి దిగారు. బుధవారం ఉదయం మోపిదేవి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో నాలుగో విడత ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు మహిళలకు చెక్కులు అందజేశారు. ఉదయం 9 గంటలకు సమావేశానికి ప్రతీ గ్రూపు నుంచి రావాలని మండల మహిళా సమాఖ్య ఉద్యోగులు మహిళలను తరలించారు. అయితే తాగునీరు, మరుగుదొడ్లు ఇతర సౌకర్యాలు లేకపోవటంతో ఉదయం నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పడిగాపులు పడాల్సి వచ్చిందంటూ మహిళలు ఉద్యోగులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యఅతిథుల ప్రసంగాలు జరుగుతుండగానే గుంపులుగా బయటికి వెళ్లిపోతుండటంతో అక్కడున్న నేతలు, అధికారులు అడ్డుకునే ప్రయత్నం చేయగా వారిపై తిరుగుబాటు చేశారు. బిస్కెట్ ప్యాకెట్ల కోసం తోపులాట జరగటంతో పలువురు వృద్ధులు కింద పడిపోయారు.



అవనిగడ్డలో నిరసన తెలుపుతున్న డీఎస్సీ విద్యార్థులు

మినీ డీఎస్సీతో నిరుద్యోగులకు అన్యాయం

» జగన్ సర్కారుపై విద్యార్థుల నిరసన

అవనిగడ్డ, జనవరి 31 : అధికారంలోకి వచ్చిన తర్వాత ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయకుండా.. కేవలం ఆరువేల పోస్టులతో డిఎస్సీ వేసి జగన్ ప్రభుత్వం నిరుద్యోగులకు తీరని అన్యాయం చేస్తున్నదని అవనిగడ్డలో డీఎస్సీ శిక్షణ పొందుతున్న విద్యార్థులు బుధవారం ఆందోళన చేపట్టారు. అవనిగడ్డ వంతెన సెంటర్‌లో రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ మినీ డీఎస్సీ వద్దు.. మెగా డీఎస్సీ కావాలని నిరుద్యోగులు నినదించగా, వారికి తెలుగుదేశం పార్టీ మద్దతు తెలిపింది. ఐదేళ్లపాటు నిరుద్యోగులను ఆశపెట్టి నేడు కేవలం ఆరువేల పోస్టులు మాత్రమే భర్తీ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవటం అన్యాయమని, వెంటనే రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులన్నింటికి నోటిఫికేషన్ విడుదల చేయాలని విద్యార్థులు డిమాండ్ చేశారు.



విచారణ చేస్తున్న డీవైఈవో వెంకటప్పయ్య

నూతిపాడు పాఠశాలలో డీవైఈవో విచారణ

విస్సన్నపేట : వేమిరెడ్డిపల్లి శివారు నూతిపాడు ఎంపీయూపీ పాఠశాలను డీఈవో తాహెరా సుల్తానా ఆదేశాల మేరకు నందిగామ డీవైఈవో వెంకటప్పయ్య బుధవారం విచారణ చేపట్టారు. పేరెంట్స్ కమిటీ, విద్యార్థులు, పేరెంట్స్‌తో ఆయన మాట్లాడారు. మంగళవారం జరిగిన ఘటనపై పూర్తి విచారణ చేస్తున్నామన్నారు. ఇప్పటికే నియమించిన ఇద్దరు టీచర్లతో పాటు ఇద్దరు సబ్జెక్ట్ టీచర్లను నియమిస్తున్నామన్నారు. ఎమ్మీవో-1 రాజశేఖర్‌పై చర్యలకు సిఫారసు చేసినట్టు ఆయన తెలిపారు.



డిస్ట్రిక్ట్ రెవెన్యూ ఆఫీసర్ నాగేశ్వరరావుకు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నేతలు

ఎన్నికల ప్రక్రియకు కమిషనర్‌ను దూరం పెట్టండి

» జిల్లా అధికారికి టీడీపీ నేతల ఫిర్యాదు

ఇబ్రహీంపట్నం, జనవరి 31 : కొండపల్లి మున్సిపాలిటీలో మెజార్టీ సభ్యుల మనోభావాలను దెబ్బతీస్తూ అభివృద్ధిలో భాగస్వాములు చేయకుండా ఓటర్ల తుది జాబితా సమర్పించడంలో పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరించిన కమిషనర్ (ఏఈఆర్‌వో) చింతకుంట్ల వెంకటేశ్వర్లును ఎన్నికల ప్రక్రియకు దూరంగా ఉంచాలని టీడీపీ కౌన్సిలర్లు, నేతలు బుధవారం కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ అడిషనల్ డైరెక్టర్ ఆశాజ్యోతికి, జిల్లా ఎన్నికల ప్రధాన అధికారి, డిస్ట్రిక్ట్ రెవెన్యూ ఆఫీసర్ నాగేశ్వరరావులకు బుధవారం ఫిర్యాదు చేశారు. జంపాల సీతారామయ్య, చుట్టుకుదురు శ్రీనివాసరావు, చెన్నుబోయిన చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

రైతుల నుంచి దోచేసిన రూ.35 వేల కోట్లు తాడేపల్లి ఖజానాకు

» మాజీమంత్రి ఉమా ధ్వజం



ధాన్యాన్ని పరిశీలిస్తున్న దేవినేని ఉమా

రెడ్డిగూడెం, జనవరి 31 : ధాన్యం రైతుల నుంచి దోచేసిన సొమ్ము రూ.35 వేల కోట్లు తాడేపల్లి ఖజానాకు చేరాయని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ఆరోపించారు. కూనపరాజుపర్వలో ఆయన బుధవారం రాత్రి ధాన్యం తక్షణం కొనుగోలు చేయాలని రైతులతో కలిసి నిరసన చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, తడిసి రంగు మారిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి రైతుల్ని ఆదుకోవాని ఆయన డిమాండ్ చేశారు. ధరల స్థిరీకరణ నిధి అంటూ మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చి రైతులను దోచుకున్న వైసీపీ ప్రభుత్వానికి ఇవే చివరి ఎన్నికలన్నారు.

నేటినుంచి కార్డుదారులకు రేషన్ పంపిణీ

» ఎన్టీఆర్ జిల్లా జేసీ సంపత్‌కుమార్

కృష్ణలంక : కార్డుదారులకు రేషన్ సరుకుల పంపిణీ ఫిబ్రవరి 1వ తేదీ గురువారం నుంచి ప్రారంభమవుతుందని జేసీ పి.సంపత్‌కుమార్ తెలిపారు. ఎండీయూ ఆపరేటర్లు గురువారం నుంచి ప్రతిరోజు ఉదయం 7 గంటలకు షెడ్యూల్ ప్రకారం బియ్యం, పంచదార ఫిబ్రవరి 1వ తేదీన గురువారం నుంచి 17వ తేదీ వరకు కార్డుదారుల ఇంటి వద్దనే పంపిణీ చేసేలా ఆదేశించామన్నారు. విటమిన్ ఎ, ఫోలిక్ యాసిడ్, విటమిన్ బి12, ఐరన్ కలిపిన పోషక విలువలతో కూడిన బియ్యాన్ని పంపిణీ చేయుచున్నందున కార్డుదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వీటితోపాటు పట్టణ కార్డుదారులకు చిక్కీ, గోధుమ పిండిని కేజీ రూ.16కే ఇవ్వడం జరుగుతుందన్నారు. సరుకుల పంపిణీలో ఫిర్యాదులు వుంటే టోల్ ఫ్రీనెం.1967కు ఫిర్యాదు చేయాలని జేసీ తెలిపారు.

టీడీపీ-జనసేన ప్రభుత్వం రాగానే

భూ హక్కు చట్టం రద్దు చేస్తాం

» న్యాయవాదులకు టీడీపీ నేతల హామీ

» దీక్షకు సీపీఐ రామకృష్ణ సంఘీభావం

» 43వ రోజుకు రిలే నిరసన దీక్షలు



న్యాయవాదుల రిలే దీక్షకు సంఘీభావం తెలుపుతున్న సీపీఐ రామకృష్ణ, నెట్టెం, బొండా తదితరులు

విజయవాడ లీగల్, జనవరి 31 : రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ-జనసేన ప్రభుత్వం అధికారంలోకి రాగానే సైకో ముఖ్యమంత్రి జగన్ ప్రవేశపెట్టిన భూ హక్కు చట్టం-2022 రద్దు చేస్తామని టీడీపీ మాజీ ఎమ్మెల్యేలు నెట్టెం రఘురాం, బొండా ఉమ, దేవినేని ఉమా, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, రాష్ట్ర కార్యదర్శి గన్నే ప్రసాద్ (అన్న), తదితరులు న్యాయవాదులకు హామీ ఇచ్చారు. భూ హక్కు చట్టం-2022ను వ్యతిరేకిస్తూ బెజవాడ బార్ న్యాయవాదులు చేపట్టిన నిరసన దీక్షలు 43వ రోజుకు చేరాయి. బుధవారం నాటి నిరసన దీక్షలో రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు చలసాని అజయ్‌కుమార్, సీనియర్ న్యాయవాది చేకూరి శ్రీపతి, టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి గుడపాటి లక్ష్మీనారాయణలతో పాటు 40మంది పాల్గొన్నారు. వీరికి సంఘీభావం ప్రకటించేందుకు వచ్చిన టీడీపీ నాయకులు మాట్లాడుతూ, రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమి అధికారంలోకి రావడం ఖాయమని, అధికారంలోకి వచ్చిన వెంటనే భూ హక్కు చట్టం-2022ను రద్దు చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. సైకో జగన్ పాలనలో ఉద్యోగులు, అంగన్వాడీ కార్యకర్తలు, మున్సిపల్ కార్మికులతో పాటు న్యాయవాదులను కూడా రోడ్డెక్కించారని మండిపడ్డారు. త్వరలో జగన్‌ను ప్రజలు ఓటు ద్వారా ఇంటికి పంపడం ఖాయమన్నారు.

ప్రచార పిచ్చి పరాకాష్టకు : సీపీఐ రామకృష్ణ

ప్రభుత్వం ఇచ్చే అన్ని పాస్‌పుస్తకాలు, టైటిల్‌డీడ్ డాక్యుమెంట్లపైనా తాతల నాటి ఆస్తులను మార్పులు చేసినా రైతు ఫొటో ఒకటి వుంటే నాలుగైదు చోట్ల జగన్ బొమ్మ వేసుకోవడం చూస్తుంటే ఈ ప్రభుత్వానికి ప్రచార పిచ్చి పరాకాష్టకు చేరిందనిపిస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. న్యాయవాదులు 43 రోజులుగా నిరసన దీక్షలు చేస్తూ వ్యతిరేకతను తెలియజేస్తున్నా ప్రభుత్వానికి కనీసం చీమకుట్టినట్టు కూడా లేదన్నారు. గ్రామ గ్రామాన, పట్టణాలు కూడళ్లలో ఆట పాటల ద్వారా భూ హక్కు చట్టం వలన కలిగే నష్టాన్ని ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత కూడా న్యాయవాదులపైనే వుందన్నారు.

ప్రజానాట్యమండలి కళాకారులు ఆట పాటల ద్వారా వ్యతిరేక విధానాలను తెలియజేస్తూ ప్రభుత్వాన్ని ఎండగట్టారు. అనంతరం న్యాయవాదులు సామూహికంగా వంటా వార్పు నిర్వహించారు. కార్యక్రమంలో బెజవాడ బార్ కార్యవర్గసభ్యులతో పాటు సీనియర్, జూనియర్ న్యాయవాదులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ఓటు ఆయుధంతో బుద్ధి చెప్పాలి

చేతులకు సంకెళ్లతో న్యాయవాదుల నిరసన ప్రదర్శన

మచిలీపట్నం టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన పెనుభూతం లాంటి భూహక్కు చట్టం రద్దు అయ్యేందుకు ప్రజలు రానున్న ఎన్నికల్లో ఓటు అనే



వజ్రాయుధంతో తగిన బుద్ధి చెప్పాలని న్యాయవాదులు పిలుపునిచ్చారు. మచిలీపట్నం జిల్లా కోర్టు ప్రాంగణంలో బుధవారం భూ హక్కు చట్టాలను రద్దు చేయాలంటూ న్యాయవాదులు చేతులకు సంకెళ్లు వేసుకుని నిరసన తెలిపారు. ఈ నిరసన ప్రదర్శనలో మచిలీపట్నం న్యాయవాదుల సంఘం ప్రధాన కార్యదర్శి కొట్టె రఘురాం, సీనియర్ న్యాయవాది పోతురాజు తదితరులు మాట్లాడారు. న్యాయానికి సంకెళ్లు వేసి చీకటి చట్టంతో ప్రజలను పాలకులు మోసం చేస్తున్నారన్నారు. నిరసన ప్రదర్శనలో న్యాయవాదులు పుప్పాల ప్రసాద్, టి.సత్యనారాయణ, కె.వి.ఎస్. ప్రకాశరావు, ఎండీ మస్తాన్, జి.శ్రీనివాస్, సర్వా లలితకుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల్లో చైతన్యం కలిగించాలి : మండలి

చల్లపల్లి : భూ హక్కు చట్టం ద్వారా నిర్ణయాత్మక అధికారాలు తహసీల్దార్ల చేతుల్లో ఉంచటం అత్యంత ప్రమాదకరమనీ, ఈ చట్టానికి వ్యతిరేకంగా ప్రజల్ని చైతన్యపరచాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ అన్నారు. చల్లపల్లి చంద్ర రాజేశ్వరరావు వికాసకేంద్రంలో భూ హక్కు చట్టం వల్ల కలిగే నష్టాలు, అనుసరించాల్సిన విధానాలపై బుధవారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న బుద్ధప్రసాద్ మాట్లాడుతూ, భూ హక్కు చట్టంపై ప్రభుత్వం వెనుకడుగు వేసేలా ఐక్యంగా పోరాడదామన్నారు. రాష్ట్రంలో ఐఏఎస్, ఐపీఎస్ అధికారులే చట్టాలను ఉల్లంఘిస్తు, అవినీతికి అధికారులే ఆజ్యం పోస్తున్న పరిస్థితులు రాష్ట్రంలో నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చట్టం వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్ని చైతన్యం చేయాలని సూచించారు. ప్రముఖ న్యాయవాది, జనసేన నేత మత్తి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, భూ హక్కు చట్టం ప్రజల ఆస్తులు, మనుగడకు ఇబ్బందికరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ చట్టాన్ని తీసుకురావటం



దురదృష్టకరమన్నారు. సీపీఐ రాష్ట్ర నేత వెలగపూడి ఆజాద్ మాట్లాడుతూ, భూ హక్కు చట్టం ద్వారా ప్రజలు ప్రమాదకర పరిస్థితుల్లోకి నెట్టబడ్డారని తెలిపారు. సీపీఎం నేత శీలం నారాయణరావు మాట్లాడుతూ, భూ హక్కులపై సమస్య ఏర్పడితే గ్రామీణ ప్రాంత రైతాంగం, సామాన్యులు హైకోర్టులో కేసు వేసుకోవాల్సిన పరిస్థితి వచ్చిందనీ, ఇది చాలా దుర్మార్గమన్నారు. సీపీఐ సీనియర్ నేత మాలెంపాటి కాంచనరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంఎల్ పార్టీనేత జన్ను జగన్, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, సీపీఐ జిల్లా కార్యదర్శి అడ్డాడ ప్రసాద్‌బాబు, రైతు సంఘాల నేతలు తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా గుణదల కొండపై స్మృతివనం

» మేరీ మాత శతాబ్ది మహోత్సవాల నవదిన ప్రార్థనలు ప్రారంభం

» మహనీయుల విగ్రహాల ఆవిష్కరణ



పూర్వపు పీఠాధిపతి బిషప్ డోమ్నిని గ్రాసి కాంస్య విగ్రహం ఆవిష్కరణలో గురువులు

గుణదల, జనవరి 31 : గుణదలమాత నూరు వసంతాల మహోత్సవ నవదిన ప్రార్థనలు బుధవారం కనుల పండుగలా ప్రారంభమయ్యాయి. విజయవాడ కథోలిక పీఠం బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు, మోన్సిగ్నోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్, పుణ్యక్షేత్రం రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజులు గుణదలమాత నూరు వసంతాల పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బిషప్ భక్తులనుద్దేశించి సందేశమిస్తూ దేవుని తల్లి అయిన మరియ మాతను ఆశ్రయిస్తే భక్తుల కోర్కెలు నెరవేరుతాయని చెప్పారు. నూరు వసంతాల మహోత్సవాల సందర్భంగా గుణదలమాత క్షేత్రం అభివృద్ధికి దోహదపడిన పూర్వపు పీఠాధిపతులు బిషప్ డోమ్నిని గ్రాసి, బిషప్ అంబ్రోస్ డి బతిస్తా, గురువులు ఫాదర్ అర్లాటి, ఫాదర్ బియాంకి, బ్రదర్ బెర్తోలి, బ్రదర్ క్రిప్పా, బ్రదర్ జియాని డేవిడ్‌ల పేరిట స్మృతివనం ఏర్పాటు చేసి వారి విగ్రహాలను ఆవిష్కరించడం ఆనందదాయకమన్నారు. మోన్సిగ్నోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్ మాట్లాడుతూ.. వేడుకలకు ముఖ్య అతిథిగా ఇండియా, నేపాల్ అపోస్తోలిక (పోప్) రాయబారి మహా ఘన లియోపొల్డో జిరెల్లి, ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన పీఠాధిపతులు హాజరుకానున్నారన్నారు. కొండపై నూతనంగా ఏర్పాటు చేసిన స్మృతివనం మహనీయుల నూతన విగ్రహాలను పీఠాధిపతి బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు ఆవిష్కరించారు. శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని బెంజిసర్కిల్ సెంట్ పాల్స్ కథెడ్రల్ నుంచి గుణదల మాత పుణ్యక్షేత్రం వరకు ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై లూర్దుమాతను భక్తులు భారీ ఊరేగింపు చేశారు. గురువులు సమిష్టి దివ్యపూజాబలి సమర్పించారు. భక్తులకు పుణ్యక్షేత్రం రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజు దివ్యసత్ప్రసాదం అందజేశారు.

ఆడుదాం ఆంధ్రాతో ప్రజల్లో క్రీడా సంస్కృతి

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



కృష్ణలంక, జనవరి 31 : ప్రజల్లో క్రీడా సంస్కృతి ద్వారా ఆరోగ్యకర జీవనశైలిని పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా 'ఆడుదాం ఆంధ్రా' క్రీడోత్సవాలను నిర్వహిస్తోందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. 'ఆడుదాం ఆంధ్రా' జిల్లా స్థాయి పోటీలను కలెక్టర్, జేసీ పి.సంపత్‌కుమార్‌తో కలిసి బుధవారం ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ప్రారంభించారు. కలెక్టర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం జిల్లా క్రీడాప్రాధికార సంస్థ పతాకాన్ని జేసీ సంపత్‌కుమార్, 'ఆడుదాం ఆంధ్రా' పతాకాన్ని ముఖ్యఅతిథులతో కలిసి నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి ఆవిష్కరించారు. క్రీడాకారులు ముఖ్య అతిథులకు గౌరవ వందనం సమర్పించారు. క్రీడా స్ఫూర్తి ప్రతిజ్ఞ అనంతరం కలెక్టర్ ఢిల్లీరావు క్రికెట్ ఆడి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఢిల్లీరావు మాట్లాడుతూ, ప్రజల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించి ఆరోగ్యకర సమాజ నిర్మాణంతో పాటు విలువైన క్రీడాకారులను వెలికితీసేందుకు 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా సంబరాలు గత డిసెంబరు 26న జిల్లాలో 605 గ్రామ, వార్డు సచివాలయాల స్థాయిలో ప్రారంభమయ్యాయని ఆపై మండల, నియోజకవర్గ స్థాయి పోటీలు విజయవంతంగా ముగిసాయని, బుధవారం జిల్లాస్థాయి పోటీలు ప్రారంభమయ్యాయని తెలిపారు. నియోజకవర్గ స్థాయిలో విజేత జట్లు జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటున్నాయని, క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖో ఖో, బ్యాడ్మింటన్ కేటగిరిల్లో ఈ పోటీలు మూడు రోజుల పాటు జరుగుతాయన్నారు. జిల్లాస్థాయి విజేతలు ఫిబ్రవరి 6 నుంచి విశాఖపట్నంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు. జిల్లా స్థాయి పోటీలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని, క్రీడాకారులకు రవాణా, భోజన, వసతి తదితర సదుపాయాలు కల్పించినట్లు కలెక్టర్ తెలిపారు. ఆడుదాం ఆంధ్రా జిల్లా నోడల్ అధికారి, జేసీ పి.సంపత్‌కుమార్ మాట్లాడుతూ, ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో మహిళల ప్రాతినిధ్యం పెరగడం ఆనందించదగ్గ విషయమన్నారు. జిల్లాస్థాయిలో 69 మ్యాచ్‌లు జరగనున్నాయని, పోటీలను విజయవంతం చేయాలన్నారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఈ క్రీడా పోటీలకు నగదు, ఇతర బహుమతుల కోసం రూ.12 కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగావకాశాలు కూడా దక్కించుకోవచ్చని, క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

పేదలకు కేశినేని నాని, జగన్ ఏమిచ్చారో చెప్పాలి

» కొలికిపూడి శ్రీనివాసరావు

వన్‌టౌన్, జనవరి 31 : విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గంలో టీడీపీ సీనియర్ నేత కేశినేని శివనాథ్ (చిన్ని) సేవాభావంతో పేదలకు అండగా ఉంటున్నారని, టీడీపీ నుంచి వైసీపీలోకి వెళ్లిన విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని), సీఎం జగన్‌లు నేరుగా పేదలకు ఏమిచ్చారో స్పష్టం చేయాలని టీడీపీ నాయకుడు కొలికిపూడి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. బుధవారం విజయవాడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబునాయుడు, లోకేశ్‌లపై విమర్శలు చేస్తే ప్రచారం జరుగుతుందన్న ఉద్దేశ్యంతో కేశినేని నాని అవాకులు చవాకులు పేలుతున్నాడన్నారు. దారితప్పిన శ్రీనివాస్ ఇష్టాను సారం వ్యవహరిస్తే టీడీపీ శ్రేణులు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు, ఎంపీ విజ్ఞత కోల్పోకుండా మర్యాదను కాపాడుకుని మాట్లాడాలని హితవు చెప్పారు. తిరువూరు మాజీ ఎమ్మెల్యే స్వామిదాస్‌కు టీడీపీ ఐదుసార్లు అవకాశం ఇవ్వడమే కాకుండా ఆయన భార్యకు జడ్పీ పరిషత్ ఛైర్‌పర్సన్ ఇస్తే పార్టీకి ద్రోహం చేశారన్నారు. కేశినేని నాని వ్యాపారంలో నష్ట పోవడంలో పార్టీకి ఎటువంటి సంబంధం లేదన్నారు.

పోలీస్.. పక్షపాతం

(5వ పేజీ తరువాయి)

కార్యకర్తను చెంపపై కొట్టడంతో ఉద్రికత్త చోటు చేసుకుంది. ఈ వ్యవహారంలోనూ పోలీసులు ఎవరిపై చర్య తీసుకోలేదు.

చంద్రబాబు పర్యటనలోనూ..

జడ్ ప్లస్ కేటగిరీ భద్రత ఉన్న చంద్రబాబు పర్యటనలోనూ పోలీసుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపించింది. 2023, ఏప్రిల్ 13న చంద్రబాబు పర్యటన నేపథ్యంలో స్థానిక శరత్ థియేటర్ వద్ద వైసీపీ జెండాలను కట్టుకుని సుంకర శ్యామ్ అలియాస్ పెద్ద అవు టీడీపీ నాయకులపై కవ్వింపు చర్యలకు పాల్పడ్డాడు. టీడీపీని, నాయకులను తిడుతూ హల్‌చల్ చేశాడు. మాగంటి బాబు అనుచరులు అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య బాహాబాహీ జరిగింది. ఈ వివాదాన్ని పోలీసులు చూసీచూడనట్టుగా వదిలేశారు.

● ఈనెల 18వ తేదీన స్థానిక బైపాస్ రోడ్డులోని టీడీపీ కార్యాలయం నుంచి ఎన్టీఆర్ స్టేడియానికి బయల్దేరిన టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెనిగండ్ల రాము ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులను పోలీసులు అడ్డుకున్నారు. వాహనాలకు అడ్డుగా పోలీసులు పెట్టిన బారికేడ్లను టీడీపీ శ్రేణులు తోసివేశారు. దీంతో అసహనానికి గురైన వన్‌టౌన్ సీఐ ఇంద్ర శ్రీనివాసరావు టీడీపీ కార్యకర్తపై లాఠీతో విరుచుకుపడ్డారు. స్థానిక కొత్త మున్సిపల్ కార్యాలయం వద్ద అన్నదాన కార్యక్రమం దగ్గర ఉన్న ఎమ్మెల్యే నాని తన అనుచరులను టీడీపీ ర్యాలీపైకి ఉసిగొల్పారు. దీంతో నాని ముఖ్య అనుచరులు వల్లూరుపల్లి సుధాకర్, గుడ్లవల్లేరు బాబ్జీ తమ అనుచరులతో కలిసి ఒక్కసారిగా టీడీపీ ర్యాలీపైకి దాడికి తెగబడేందుకు ప్రయత్నించారు. ఒకదశలో వెనిగండ్ల రామును సైతం పోలీసులు అడ్డుకున్నారు.

● గుడివాడ మండలం వలివర్తిపాడులోని రీసర్వే నెంబర్ 180లోని రూ.కోట్ల విలువైన మధ్యతరగతి వారికి చెందిన 60 మందికిపైగా చెందిన ప్లాట్లను కబ్జా చేశారు. ఈ వ్యవహారంలో నాని ముఖ్య అనుచరుడిపై తాలుకా పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైనా.. దర్యాప్తు ఇంచు కూడా ముందుకు సాగలేదు.

జనసేన ఫ్లెక్సీలే తొలగించారు.. వైసీపీవి వదిలేశారు..

విజయవాడ కృష్ణలంకలో వైసీపీ ఏర్పాటుచేసిన సిద్ధం ఫ్లెక్సీలకు పోటీగా జనసేన నాయకులు మేమూ సిద్ధమే.. అంటూ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఈ వివాదం ముదిరి రెండుపక్షాల నడుమ ఘర్షణకు దారితీయడంతో పోలీసులు జోక్యం చేసుకుని జనసేన ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలు తొలగించి, వైసీపీవి అలాగే ఉంచారు.



కేశినేని శివనాథ్ (చిన్ని) దంపతుల ఆధ్వర్యంలో పూర్ణాహుతి హోమం

రాష్ట్రంలో మంచి పాలన రావాలని కేశినేని శివనాథ్ హోమాలు

వన్‌టౌన్, జనవరి 31 : రాష్ట్రంలో దుష్టపాలన పోయి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో మంచిపాలన రావాలని, ప్రజలు సంతోషంగా జీవించాలన్న సంకల్పంతో టీడీపీ సీనియర్ నేత కేశినేని శివనాథ్(చిన్ని) దంపతులు హోమాలు నిర్వహించారు. గురునానక్ కాలనీలోని అన్న క్యాంటీన్ ప్రాంగణంలో హోమాలకు బుధవారం వేదమంత్రాల మధ్య మహాపూర్ణాహుతి నిర్వహించారు. శ్రీచక్ర నవావరణార్చన, సుదర్శన హోమం, నరసింహ హోమం, ఆయుత చండీ యాగాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు నెట్టెం రఘురాం, దేవినేని ఉమా, గద్దె రామమోహన్, బుద్దా వెంకన్న నాగుల్‌మీరా, పరుచూరి అశోక్‌బాబు, తంగిరాల సౌమ్య, శావల దేవదత్, యార్లగడ్డ వెంకట్రావు, గన్నె ప్రసాద్(అన్న), అభిమానులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



తిరుపతమ్మ ఆలయంలో కేంద్ర మాజీమంత్రి సర్వే

రాహుల్ ప్రధాని కావాలని..

పెనుగంచిప్రోలు, జనవరి 31 : వచ్చే ఎన్నికల్లో రాహుల్ ప్రధాని కావడం ఖాయమని కేంద్ర మాజీమంత్రి సర్వే సత్యనారాయణ అన్నారు. కేంద్ర మాజీమంత్రి సర్వే సత్యనారాయణ, మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్‌లు బుధవారం తిరుపతమ్మ అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా సర్వే మాట్లాడుతూ, దేశ ప్రజలు మార్పును కోరుకుంటున్నారని, రాహుల్ ప్రధాని కావాలని, ప్రజలు సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు చెప్పారు. ఏపీలో వైఎస్ షర్మిలా రెడ్డి నాయకత్వంలో పార్టీకి పూర్వ వైభవం వస్తుందన్నారు. ఉమ్మడి ఆంధ్రాలో 42 పార్లమెంట్ స్థానాలు కాంగ్రెస్ పార్టీకే వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

డిగ్రీ మొదటి సెమిస్టర్ ఫలితాలు విడుదల

మచిలీపట్నం టౌన్, జనవరి 31 : కృష్ణావిశ్వవిద్యాలయం నిర్వహించిన డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షా ఫలితాలను బుధవారం ఉపకులపతి ఆచార్య జి.జ్ఞానమణి విడుదల చేశారు. ఈ సందర్భంగా జ్ఞానమణి మీడియాతో మాట్లాడారు. 6773 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 3715 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. 54.85 ఉత్తీర్ణతా శాతం ఉందన్నారు. డిసెంబరులో పరీక్షలు నిర్వహించి జనవరిలో ఫలితాలు విడుదల చేశామన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ పి.వీరబ్రహ్మచారి, పరీక్షల నియంత్రణాధికారి కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్బీకేలో రైతుల సమస్యలు తెలుసుకుంటున్న జేసీ


ధాన్యం కొనుగోలులో అవరోధాలు తొలగిస్తాం

» కృష్ణా జేసీ గీతాంజలి శర్మ


పామర్రు, జనవరి 31 : ఖరీఫ్ ధాన్యం కొనుగోలులో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందుల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మ అన్నారు. బుధవారం పామర్రు రైతు భరోసా కేంద్రంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను స్థానిక ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా తుపాను వల్ల రంగుమారి దెబ్బతిన్న ధాన్యం కొనుగోలులో రైతుల ఇబ్బందులను ఆమె దృష్టికి తీసుకువచ్చారు. కొనుగోలులో ధరల బారం రైతులపై పడకుండా చూడాలని కోరారు. తుఫాన్ సమయంలో ఆఫ్‌లైన్ పద్ధతి ద్వారా సేకరించిన ధాన్యం తక్షణమే ఆన్‌లైన్ చేసి రైతులకు నగదు ఇప్పించాలని, రవాణాకు అవసరమైన వాహనాలను వెంటనే సమకూర్చాలని జేసీ దృష్టికి తీసుకువచ్చారు. రైతుల ఇబ్బందుల పరిష్కారానికి తక్షణం చర్యలు తీసుకుంటానని, అధైర్య పడవద్దని జేసీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సివిల్ సప్లయిస్ డీఎం డి.రాజు, డిఎస్‌వో పార్వతీ తహసిల్దార్ వి.భరత్‌రెడ్డి, రైతులు, ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.

ఓటర్ల తుది జాబితాలో సిత్రాలు!

జగ్గయ్యపేట రూరల్, జనవరి 31 : ఓటర్ల తుది జాబితాలో చిత్ర విచిత్రాలు కనిపిస్తున్నాయి. ఓటరు పేరు హిందీ భాషలో.. మిగిలిన వివరాలు తెలుగులో ముద్రించటంతో పాటు మృతులకు కూడా ఓటు హక్కు కల్పించారు.



మృతుల ఓట్లు తొలగించాలని దరఖాస్తు చేసినా వారి పేర్లు తాజాగా జాబితాలో ఉండటంపై విస్మయం వ్యక్తం చేస్తున్నారు. అనుమంచిపల్లి, గౌరవరం గ్రామాల జాబితాల్లో అమెర చినవీరయ్య మూడేళ్ల క్రితం మృతి చెందాడు. కాటంశెట్టి త్రిపాదు ఏడాది క్రితం మృతి



హిందీలో నమోదైన పేరు

చెందాడు. వారి పేర్లు ఓటర్ల జాబితాలో ఉన్నాయి. బూత్ నెం 18, 19లో ఓటరు పేర్లు హిందీలో నమోదు కాగా మిగిలిన వివరాలు తెలుగులో ఉన్నాయి. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించటం లేదని నేతలు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు జాబితాను పరిశీలించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	121, 129, 140
చికెన్ విత్ స్కిన్	230
చికెన్ స్కిన్‌లెస్	240

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.25

11న కంకిపాడులో దళిత గర్జన

● విజయవంతం చేయాలని బోడె ప్రసాద్ పిలుపు

పెనమలూరు, జనవరి 31: కంకిపాడు టీడీపీ కార్యాలయం వద్ద ఈనెల 11న దళిత గర్జనను నిర్వహిస్తున్నామని, విజయవంతం చేయాలని పార్టీ దళిత నాయకులకు మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పిలుపునిచ్చారు. బుధవారం పార్టీ పోరంకి కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ అధికారం చేపట్టినప్పటి నుంచి దళితులపై ఆపార్టీ సాగిస్తున్న దమనకాండను నిరసిస్తూ దళితగర్జన నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమానికి మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు, ఎంఎస్ రాజు, కొలికిపూడి శ్రీనివాస్, టీడీపీ పామర్రు ఇన్‌చార్జి వర్ల కుమార్‌రాజా హాజరవుతారని పేర్కొన్నారు. సమావేశంలో సూదిమళ్ల రవీంద్ర, పులి విజయ్, సుధాకర్, రవికుమార్, డీఎన్నార్, ప్రకాష్, రవి, ఉయ్యూరు మహేష్, శరత్ పాల్గొన్నారు.

పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టాలి

● ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాచేటి మురళీ డిమాండ్

గన్నవరం, జనవరి 31: పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టి అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాచేటి మురళీ డిమాండ్ చేశారు. మండలంలోని చింతగుంటలో బుధవారం ఆయన మాట్లాడారు. 1996లో జస్టిస్ రామచంద్రరాజు కమిషన్ వర్గీకరణకు అనుకూలంగా రిపోర్టు ఇచ్చిందన్నారు. 2004లో జస్టిస్ ఉషా మెహ్రా కమిషన్ కూడా అనుకూలంగానే రిపోర్టు ఇచ్చినప్పటికీ ఫలితం శూన్యమని అన్నారు. ప్రధాని మోదీ వర్గీకరణపై మళ్లీ కమిటీ వేయటం కాలయాపనకేనని ఆయన అన్నారు. వర్గీకరణపై మోదీకి ఏమాత్రం చిత్తశుద్ధి లేదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వరదయ్య, వీరమ్మ, మరియమ్మ, ప్రశాంత్, జానేష్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి

● ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులనూ దారి మళ్లించిందీ ప్రభుత్వం
● టీడీపీ పెనమలూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బోడె ప్రసాద్

ఉయ్యూరు, జనవరి 31: "వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైంది. ఆఖరికి ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులనూ ప్రభుత్వం దారి మళ్లించింది. ఒక్క రూపాయి కూడా దళితులకు ఖర్చు పెట్టలేదు. టీడీపీ హయాంలోనే ఎస్సీ, ఎస్టీ కాలనీల అభివృద్ధి జరిగింది. వైసీపీ ప్రభుత్వంలో ఆ కాలనీలకు ఒరగబెట్టిందేమీ లేదు." అని టీడీపీ పెనమలూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బోడె ప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నగర పంచాయతీ 5వ వార్డులో బుధవారం బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. చంద్రబాబు ప్రకటించిన అభివృద్ధి సంక్షేమ పథకాలను వివరించి వచ్చే ఎన్నికల్లో టీడీపీకి ఓటేసి, రాష్ట్ర అభివృద్ధికి సాయపడాలని ఆయన కోరారు. కార్పొరేషన్లు ఏర్పాటు చేసినట్టు డాంబికాలు పలికే ముఖ్యమంత్రి ఒక్క కార్పొరేషన్‌కైనా నిధులు కేటాయించారా అని ప్రశ్నించారు. చదువుకున్న యువత ఇతర రాష్ట్రాలకు వలసపోవలసిన దుస్థితి దాపురించిందన్నారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు జంపాన గుర్నాథరావు, వార్డు కౌన్సిలర్ పరిమి సలోమి సంతోషి, మాజీ చైర్మన్ జంపాన పూర్ణచంద్రరావు, ఖుద్దూస్, పార్టీ నాయకులు జగరోతు నాగరాజు, కుటుంబరావు, రంగారావు, వెంకటేశ్వరరావు, ఏసుపాదం, చంటి, ఈడే అంజి బాబు, జయదేవ్, షైదయ్య. నజీర్, జనసేన నాయకులు మహాలక్ష్మి, కార్తీక్ పాల్గొన్నారు. పెద ఓగిరాలలో పార్టీ గ్రామ అధ్యక్షుడు పోతిరెడ్డి ఆధ్వర్యంలో బాబూ ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించి టీడీపీ- జనసేన ఆధ్వర్యంలో ఏర్పడే ప్రభుత్వం అమలుచేసే అభివృద్ధి, సంక్షేమ పథాకాలను ప్రజలకు వివరించారు. సుభాని తదితరులు పాల్గొన్నారు.



ఉయ్యూరు 5వ వార్డులో బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న బోడె ప్రసాద్

ఎన్నికల సమరానికి టీడీపీ సిద్ధం: బోడె హేమ

కంకిపాడు: ఎన్నికల సమరానికి టీడీపీ సిద్ధంగా ఉందని మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ సతీమణి బోడె హేమ అన్నారు. కోలవెన్నులో బాబూ ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. రూపాయి అభివృద్ధి చేయకుండా ఐదేళ్ల అధికారాన్ని వైసీపీ ప్రభుత్వం పూర్తిగా దుర్వినియోగం చేసిందన్నారు. సంక్షేమ పథకాల పేరుతో రాష్ట్రాన్ని 13 లక్షల కోట్లు అప్పుల పాలు చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ అధికారంలోకి వస్తే అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలను చంద్రబాబు చేపడతారని భరోసా ఇచ్చారు. టీడీపీ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ, పార్టీ కోలవెన్ను అధ్యక్షుడు తుమ్మల చంద్రశేఖర్, కొణతం సుబ్రహ్మణ్యం, పులి శ్రీనివాసరావు, అన్నవరపు శివపార్వతి, కంచర్ల మోహన్, సురేష్, పాలడుగు సత్యనారాయణ, జనసేన నాయకులు పి.శివగణపతి, ఎం.రాజేంద్ర, పి.వెంకట్ పాల్గొన్నారు.



కోలవెన్ను, గొల్లగూడెంలో బాబూ ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న బోడె హేమ, బోడె వెంకట్‌రామ్

టీడీపీ విజయానికి సమష్టిగా పనిచేద్దాం: వెంకట్‌రామ్

కంకిపాడు: టీడీపీని అధికారంలోకి తెచ్చేందుకు వంద రోజులపాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు అంతా సమష్టిగా పనిచేద్దామని మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ తనయుడు బోడె వెంకట్‌రామ్ పిలుపునిచ్చారు. దావులూరులో బుధవారం నిర్వహించిన బాబూ ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వైసీపీ మళ్లీ అధికారంలోకి వస్తే రాష్ట్రం అంధకారమయమవుతుందన్నారు. టీడీపీ మేనిఫెస్టోను ప్రతి ఇంటికీ తిరుగుతూ వివరించారు. నాయకులు జల్లె కోటేశ్వరరావు, పొనుగుమాటి శ్రీనివాసరావు, వల్లే విజయ్, నత్తా తనీష్, గాలంకి సుధాకర్, గుంజ నాగేశ్వరరావు, గంటా డేవిడ్, ప్రసాద్, గాలంకి జగదీష్, జి.రాకేష్, జె.శ్రీధర్, జె.అజిత్, ఎల్.రాజ్ కుమార్, రహమాన్ పాల్గొన్నారు.

స్థానిక ప్రజాప్రతినిధులను ఉత్సవ విగ్రహాల్లా మార్చిందీ ప్రభుత్వం

● పంచాయతీల నిధులను దారి మళ్లించింది
● మండల సమావేశం నుంచి టీడీపీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యుల వాకౌట్

ఉయ్యూరు, జనవరి 31: గ్రామ పంచాయతీల నిధులు దారి మళ్లించి, గ్రామాల్లో అభివృద్ధి పనులు చేసేందుకు రూపాయి కూడా లేకుండా చేసి ప్రభుత్వం స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులను ఉత్సవ విగ్రహాల్లా మార్చిందని సర్పంచ్‌ల సంఘం ఉమ్మడి కృష్ణా జిల్లా అధ్యక్షుడు గోలి వసంతకుమార్ ఆధ్వర్యంలో టీడీపీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు మండల సమావేశంలో నిరసన తెలిపి వాకౌట్‌చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ చీలి కల్పన అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. జబర్లపూడి సర్పంచ్ ప్రసాద్, సాయిపురం సర్పంచ్ షేక్‌జాన్ బాషా, చినఓగిరాల సర్పంచ్ యెనిగళ్ల శిరీష, కాటూరు ఎంపీటీసీ సభ్యురాలు సజ్జా అనూష మాట్లాడారు. పంచాయతీ అభివృద్ధి మండలి, కేంద్ర ప్రభుత్వ పథకం జలజీవన్ మిషన్లలో రాష్ట్ర ప్రభుత్వం సర్పంచ్‌లకు ప్రాధాన్యం లేకుండా చేసిందన్నారు. గ్రామ పంచాయతీలకు కేంద్రం విడుదల చేసిన ఆర్థిక సంఘం నిధులను రాష్ట్ర ప్రభుత్వం దొంగిలించి పంచాయతీల ఖాతాల్లో రూపాయి లేకుండా చేసిందని ఆరోపించారు.



మండల సమావేశం నుంచి వాకౌట్ చేస్తున్న సర్పంచ్‌లు, ఎంపీటీసీలు

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కంకిపాడు, జనవరి 31: ఉప్పలూరు రైవస్ కాలువ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు అక్కడిక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉప్పలూరు గ్రామానికి చెందిన గురు ప్రసాద్(19) పదో తరగతి వరకు చదువుకున్నాడు. ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నాడు. బైక్‌పై ఉప్పలూరు వైపు నుంచి కంకిపాడు వైపు వెళ్తుండగా లారీని ఓవర్‌టేక్ చేయబోయాడు. అదుపు తప్పి లారీ కిందపడ్డాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉయ్యూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

వ్యవసాయంపై విద్యార్థులకు అవగాహన

గన్నవరం, జనవరి 31: వ్యవసాయంపై విద్యార్థులకు అవగాహన అవసరమని శ్రీ మల్లికార్జున ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ ప్రిన్సిపాల్ దాసరి మాధవీలత అన్నారు. విద్యార్థులకు బాల కర్షకులు- రైతు కూలీలు అనే అంశంపై బుధవారం ఆమె అవగాహన కల్పించారు. విద్యార్థులను సంప్రదాయ దుస్తుల్లో దగ్గరలో ఉన్న పొలాల దగ్గరకు తీసుకువెళ్లి పంటలపై అవగాహన కల్పించారు. విద్యాసంస్థల కరస్పాండెంట్ నక్కిన చిన వెంకటరాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులకు వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న మాధవీలత

పూర్వపు సీనియర్ అసిస్టెంట్ అవినీతిపై నివేదిక ఇవ్వండి

● మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి వై.శ్రీలక్ష్మిని కోరిన లోకాయుక్త

ఉయ్యూరు, జనవరి 31: ఉయ్యూరు నగరపంచాయతీ పూర్వపు సీనియర్ అసిస్టెంట్ కె.చెన్నకేశవరావు అవినీతిపై మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి వై.శ్రీలక్ష్మిని రాష్ట్ర లోకాయుక్త జస్టిస్ పి.లక్ష్మణరెడ్డి నివేదిక కోరినట్టు సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాసగౌడ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. చెన్నకేశవరావు ఉయ్యూరు నగర పంచాయతీ, తాడేపల్లిగూడెం మున్సిపాలిటీలో పనిచేసిన సమయంలో ఆస్తి పన్నులు జమచేయకపోవడం, రికార్డులు ట్యాంపరింగ్ చేసి ఆస్తి పన్ను మార్చడంపై శ్రీలక్ష్మిని నివేదిక కోరారని తెలిపారు. చెన్నకేశవరావు అవినీతిపై లోకాయుక్తకు తాను చేసిన ఫిర్యాదు మేరకే ఉత్తర్వులు జారీచేసినట్టు తెలిపారు.

అథ్లెటిక్ పోటీలకు జిల్లా జట్టు ఎంపిక

ఉయ్యూరు, జనవరి 31: అహ్మదాబాద్‌లో ఫిబ్రవరి 16 నుంచి 18వరకు నిర్వహించే అండర్-16 అథ్లెటిక్ పోటీలకు జిల్లా జట్టును ఎంపిక చేసినట్టు కృష్ణాజిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రటరీ బొడ్డు నాగలక్ష్మి తెలిపారు. ఏజీఅండ్‌ఎస్‌జీఎస్ కళాశాలలో నిర్వహించిన పోటీల్లో షాట్‌పుట్‌లో కె.అజయ్‌కుమార్, బాలికల విభాగం లాంగ్‌జంప్‌లో అశ్విత, 600 మీటర్ల పరుగులో జె.పల్లవి, పెంటలాన్‌లో ఎమ్.మంగ, టి.రుత్విజ గ్రూప్-ఏలో కె.కావ్య, బాలుర విభాగం 600 మీటర్ల పరుగు ఎస్కే మక్బుల్ హుస్సేన్, హై జంప్‌లో ఎం.రోషన్‌కుమార్, గ్రూప్ -బిలో సీహెచ్ సుధీర్ ఎంపికయ్యారన్నారు.



జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

పంట పొలాల్లోకి కార్పొరేట్ కళాశాల మురుగు

● కలెక్టర్ రాజాబాబుకు పునాదిపాడు రైతుల ఫిర్యాదు
● కలెక్టర్ ఆదేశాలతో విచారణ జరిపిన ఉయ్యూరు ఆర్డీవో రాజు

కంకిపాడు, జనవరి 31: ఓ కార్పొరేట్ కళాశాల మురుగును పంట పొలాల్లోకి వదిలేస్తుందని రైతుల ఇచ్చిన ఫిర్యాదుపై వివిధ శాఖల అధికారులు బుధవారం పునాది పాడులో పర్యటించారు. పునాదిపాడు పరిధిలోని కార్పొరేట్ కళాశాలకు చెందిన మురుగును పరిసర ప్రాంతాలల్లోని పంట పొలాల్లోకి కళాశాల యాజ మాన్యం వదిలేస్తోంది. దీంతో రైతులు పంటలు పం డక నానా ఇబ్బందులు పడుతున్నారు. అనేకమార్లు కళాశాల యాజమాన్యంతో మాట్లాడినా ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో ఇటీవల మచిలీపట్నంలో సోమ వారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో రైతులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన కలెక్టర్ పి.రాజాబాబు సమస్యను పరిష్కరించాలని ఉయ్యూరు ఆర్డీవో డి.రాజును ఆదేశించారు. పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్, విద్యా శాఖ, రెవెన్యూ, మండల పరిషత్ అధికారులతో కలిసి బుధవారం ఆయన పునాదిపాడులోని కళాశాల పరిసర ప్రాంతాల్లో పర్యటించారు. రైతులతో మాట్లాడారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కార్పొరేట్ కళాశాల యాజమాన్యంతో మాట్లాడి కళాశాల నుంచి వస్తున్న మురుగును పైపులైను ద్వారా మురుగు కోడులోకి వదిలేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. లేని పక్షంలో చర్యలు తీసుకుంటామని కళాశాల యాజమాన్యాన్ని ఆయన హెచ్చరించారు.



రైతులతో మాట్లాడుతున్న ఉయ్యూరు ఆర్డీవో డి.రాజు, డీపీవో నాగేశ్వరనాయక్ తదితరులు

మహిళా బ్యాంకు మేనేజరుపై కేసు

పెనమలూరు, జనవరి 31: తాను మేనేజరుగా పనిచేసే బ్యాంకులో ఖాతాదారు లోను కోసం పెట్టిన బంగారాన్ని లోను కట్టినా ఇవ్వకుండా మోసం చేసిన ఒక బ్యాంకు మేనేజరుపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..నూజివీడు మండలం మర్రిబందం గామానికి చెందిన కవులూరి యోగేశ్వరరావు, అదే గ్రామానికి చెందిన గంగూరులో ఓ బ్యాంకులో మేనేజరుగా పనిచేస్తున్న దావులూరి ప్రభావతికి పరిచం ఉంది. తాను పనిచేసే బ్యాంకులో యోగేశ్వరరావును ఖాతా తెరవమని ప్రభావతి అడిగారు. దీంతో అతను హైదరాబాద్‌లో ఉన్న తన ఖాతాను గంగూరు బ్యాంకుకు బదిలీ చేశాడు. బ్యాంకులో లాకర్ ఇప్పించమని అడగ్గా అవసరం లేదని చెప్పింది. తక్కువ వడ్డీకి బంగారంపై లోన్ ఇప్పిస్తానని యోగేశ్వరరావుకు చెందిన 380 గ్రాముల బంగా రాన్ని బ్యాంకులో పెట్టి రెండు లక్షల లోన్ ఇప్పించారు. తర్వాత తన బాబాయి ద్వారా డబ్బులు చెల్లించాడు. కొన్ని రోజుల తర్వాత బ్యాంకుకు వచ్చి బంగారం అడుగగా అప్పటికే తన సంతకాలు ఫోర్జరీ చేసి మేనేజరు ప్రభావతి బంగారాన్ని తీసేసుకున్నట్లు తెలిసింది. దీంతో ఆమెను నిలదీయగా ఇంటిలో బంగారం ఉందని చెప్పి గంగూరులోని తన ఇంటికి తీసుకెళ్లింది. అక్కడ తనను పెళ్లి చేసుకోవాలని బలవంతం చేయగా.. మోసపోయానని గ్రహించాడు. దీంతో యోగేశ్వరరావు పోలీసులను ఆశ్రయించాడు.

మహిళా సాధికారత టీడీపీతోనే సాధ్యం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జనవరి 31: మహిళా సాధికారత టీడీపీతోనే సాధ్యమని తెలుగుమహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయికల్యాణి అన్నారు. రంగన్నగూడెం, బండారుగూడెంలో టీడీపీ గ్రామకమిటీల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో పార్టీ సీనియర్ నేత ఆళ్ల గోపాలకృష్ణ పర్యవేక్షణలో మహిళాకమిటీలను ఆమె నియమించారు. రంగన్నగూడెంలో గ్రామ కమిటీ అధ్యక్షురాలు దోనవల్లి నాగశిరోమణి, నెరుసు రమాదేవి, దోమవరపు స్వర్ణ, దేవర కొండ నాగమణి, కసుకుర్తి సునంద, ఆలపాటి శ్రీదివ్య, కనకవల్లి సుభాషిణి, గోళ్ల విజయలక్ష్మి పాల్గొన్నారు. బండారుగూడెంలో గ్రామకమిటీ అధ్యక్షురాలు బేతాళ వెంకటేశ్వరమ్మ, పావ, పల్లవరపు రంగమ్మ, మురుదొడ్డి హేమశ్రీ, కోట సునీత, అలుగుల శ్యామల పాల్గొన్నారు.



రంగన్నగూడెంలో మహిళా కమిటీతో మూల్పూరి సాయికల్యాణి, ఆళ్ల గోపాలకృష్ణ

ఆయుర్వేద ఆస్పత్రికి రూ.20 వేల విరాళం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జనవరి 31: కానుమోలులోని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల అభివృద్ధి నిమిత్తం ఎన్నారై వల్లం కొండ రఘు పంపిన రూ.20 వేల విరాళాన్ని ఆయన స్నేహితులు బుధవారం వైద్యాధికారి డాక్టర్ వాహినికి బుధవారం అందజేశారు. రూ.20వేలను పక్షవాతంతో బాధపడే వారికి ఉచితంగా కేరళ పంచకర్మ వైద్యం అందించడానికి వినియోగిస్తామని వాహిని వివరించారు. మత్తి రాంబాబు, ఆలపాటి రమణ, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు కొండపల్లి హరిబాబు, వడ్డి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

పంచ పట్టాభిరామస్వామి ఆలయానికి ధ్వజస్తంభం అందజేత

ఉయ్యూరు, జనవరి 31: పంచ పట్టాభిరామస్వామి ఆలయానికి పారుపూడి నవీన్, పావని దంపతులు రూ.1,75,000 విలువైన టేకు ధ్వజస్తంభాన్ని బుధవారం అందజేశారు. రావిచెట్టు బజార్‌లోని పంచపట్టాభిరామ, వేణుగోపాలస్వామి ఆలయాలు పునర్నిర్మించారు. వీరమ్మ ఆలయం నుంచి ధ్వజస్తంభాన్ని పంచపట్టాభిరామస్వామి ఆలయం వరకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. సోమేశ్వరస్వామి ఆలయ పాలక మండలి చైర్మన్ చిందా వీరవెంకట కుటుంబరాజు, వేణుగోపాలస్వామి ఆలయ పాలకమండలి మాజీ చైర్మన్ లోయ చింతయ్య, ఆదిశేషు, గేదెల వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అద్భుత బాలయేసు పండుగ

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జనవరి 31: పెరికీడు జ్యోతినగర్ చర్చిలో అద్భుత బాలయేసు పండుగ బుధవారం వైభవంగా ప్రారంభమైంది. విజయవాడ మేత్రాసనం నూతన గురువులు ఫాదర్ పి.అంబేడ్కర్, కిరణ్, విజయ్, బాలస్వామి, ప్రతాప్‌ల ఆధ్వర్యంలో స్వస్థత ప్రార్థనలు, ప్రత్యేక దివ్య బలిపూజ నిర్వహించి అద్భుత బాలయేసు మహోత్సవాన్ని ప్రారంభించారు. అద్భుత బాలయేసు ప్రార్థనతో ఎంతో మంది విశ్వాసులకు గొప్పమేలు జరిగిందని వారు తెలిపారు. విచారణ కర్త ఫాదర్ జోసఫ్ తంబిని సత్కరించారు. జేఎంజే సిస్టర్స్, ఉపదేశకులు పాల్గొన్నారు. పారిస్ కౌన్సిల్ సభ్యులు, మరియదళ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



దివ్యపూజాబలిని సమర్పిస్తున్న ఫాదర్లు



అల్పాహారం బిస్కెట్ ప్యాకెట్ల కోసం తోసుకుంటున్న మహిళలు

మహిళలకు ఆసరా తిప్పలు

▸ చెక్కుల పంపిణీలో తొక్కిసలాట, కింద పడిపోయిన వృద్ధులు

మోపిదేవి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా డ్వాక్రా రుణమాఫీ, ఆసరా చెక్కుల పంపిణీ సభలో కనీస వసతులు లేక మహిళలు వాగ్వాదానికి దిగారు. బుధవారం ఉదయం మోపిదేవి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో నాలుగో విడత ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు మహిళలకు చెక్కులు అందజేశారు. ఉదయం 9 గంటలకు సమావేశానికి ప్రతీ గ్రూపు నుంచి రావాలని మండల మహిళా సమాఖ్య ఉద్యోగులు మహిళలను తరలించారు. అయితే తాగునీరు, మరుగుదొడ్లు ఇతర సౌకర్యాలు లేకపోవటంతో ఉదయం నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పడిగాపులు పడాల్సి వచ్చిందంటూ మహిళలు ఉద్యోగులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యఅతిథుల ప్రసంగాలు జరుగుతుండగానే గుంపులుగా బయటికి వెళ్లిపోతుండటంతో అక్కడున్న నేతలు, అధికారులు అడ్డుకునే ప్రయత్నం చేయగా వారిపై తిరుగుబాటు చేశారు. బిస్కెట్ ప్యాకెట్ల కోసం తోపులాట జరగటంతో పలువురు వృద్ధులు కింద పడిపోయారు.



స్కౌట్ యూనిట్లను పటిష్టం చేయాలి : డీఈవో

మచిలీపట్నం టౌన్ : స్కౌట్ యూనిట్లను పటిష్టపరిచి విద్యార్థులకు స్కౌటింగ్‌ను మరింత చేరువ చేయాలని డీఈవో తాహెరా సుల్తానా అన్నారు. స్పందన హాలులో బుధవారం జిల్లా స్కౌట్ నూతన కమిటీ ఏర్పాటు చేశారు.కలెక్టర్ అధ్యక్షుడిగా, ఉపాధ్యక్షులుగా జడ్పీ సీఈవో జ్యోతిబసు, డీఆర్వో పెద్ది రోజా, ఇన్‌కంటాక్స్ ఆఫీసర్ పి.వెంకట రామచంద్రరావు, రిటైర్డు హెచ్‌ఎం కె.భారతిదేవి, ఆడిటర్ పి.శేషాచార్యులు, న్యాయవాది అజ్మతున్నీసా ఉంటారన్నారు.

టీడీపీ-జనసేన ప్రభుత్వం రాగానే

భూ హక్కు చట్టం రద్దు చేస్తాం

▸ న్యాయవాదులకు టీడీపీ నేతల హామీ

▸ దీక్షకు సీపీఐ రామకృష్ణ సంఘీభావం

విజయవాడ లీగల్, జనవరి 31 : రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ-జనసేన ప్రభుత్వం అధికారంలోకి రాగానే సైకో ముఖ్యమంత్రి జగన్ ప్రవేశపెట్టిన భూ హక్కు చట్టం-2022 రద్దు చేస్తామని టీడీపీ మాజీ ఎమ్మెల్యేలు నెట్టెం రఘురాం, బొండా ఉమ, దేవినేని ఉమా, మాజీ ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న, తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, రాష్ట్ర కార్యదర్శి గన్నే ప్రసాద్ (అన్న), తదితరులు న్యాయవాదులకు హామీ ఇచ్చారు. భూ హక్కు చట్టం-2022ను వ్యతిరేకిస్తూ బెజవాడ బార్ న్యాయవాదులు చేపట్టిన నిరసన దీక్షలు 43వ రోజుకు చేరాయి. బుధవారం నాటి నిరసన దీక్షలో రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు చలసాని అజయ్‌కుమార్, సీనియర్ న్యాయవాది చేకూరి శ్రీపతి, టీడీపీ లీగల్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి గుడపాటి లక్ష్మీనారాయణలతో పాటు 40మంది పాల్గొన్నారు.

ప్రచార పిచ్చి పరాకాష్ఠకు : సీపీఐ రామకృష్ణ

ప్రభుత్వం ఇచ్చే అన్ని పాస్‌పుస్తకాలు, టైటిల్‌డీడ్ డాక్యుమెంట్లపైనా తాతల నాటి ఆస్తులను మార్పులు చేసినా రైతు ఫొటో ఒకటి వుంటే నాలుగైదు చోట్ల జగన్ బొమ్మ వేసుకోవడం చూస్తుంటే ఈ ప్రభుత్వానికి ప్రచార పిచ్చి పరాకాష్ఠకు చేరిందనిపిస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. న్యాయవాదులు 43 రోజులుగా నిరసన దీక్షలు చేస్తూ వ్యతిరేకతను తెలియజేస్తున్నా ప్రభుత్వానికి కనీసం చీమ కుట్టినట్టు కూడా లేదన్నారు. ప్రజానాట్యమండలి కళాకారులు ఆట పాటల ద్వారా వ్యతిరేక విధానాలను తెలియజేస్తూ ప్రభుత్వాన్ని ఎండగట్టారు. అనంతరం న్యాయవాదులు సామూహికంగా వంటావార్పు నిర్వహించారు. కార్యక్రమంలో బెజవాడ బార్ కార్యవర్గసభ్యులతో పాటు సీనియర్, జూనియర్ న్యాయవాదులు పెద్దఎత్తున పాల్గొన్నారు.



న్యాయవాదుల రిలే దీక్షకు సంఘీభావం తెలుపుతున్న సీపీఐ రామకృష్ణ, నెట్టెం తదితరులు



చేతులకు సంకెళ్లతో నిరసన ప్రదర్శన

మచిలీపట్నం టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన పెనుభూతం లాంటి భూహక్కు చట్టం రద్దు అయ్యేందుకు ప్రజలు రానున్న ఎన్నికల్లో ఓటు అనే వజ్రాయుధంతో తగిన బుద్ధి చెప్పాలని న్యాయవాదులు పిలుపునిచ్చారు. మచిలీపట్నం జిల్లా కోర్టు ప్రాంగణంలో బుధవారం భూ హక్కు చట్టాలను రద్దు చేయాలంటూ న్యాయవాదులు చేతులకు సంకెళ్లు వేసుకుని నిరసన తెలిపారు.

ఈ నిరసన ప్రదర్శనలో మచిలీపట్నం న్యాయవాదుల సంఘం ప్రధాన కార్యదర్శి కొట్టె రఘురాం, సీనియర్ న్యాయవాది పోతురాజు తదితరులు మాట్లాడారు. న్యాయానికి సంకెళ్లు వేసి చీకటి చట్టంతో ప్రజలను పాలకులు మోసం చేస్తున్నారన్నారు. నిరసన ప్రదర్శనలో న్యాయవాదులు పుప్పాల ప్రసాద్, టి.సత్యనారాయణ, కె.వి.ఎస్. ప్రకాశరావు, ఎండీ మస్తాన్, జి.శ్రీనివాస్, సర్వా లలితకుమారి తదితరులు పాల్గొన్నారు.



ప్రజల్లో చైతన్యం కలిగించాలి : మండలి

చల్లపల్లి : భూ హక్కు చట్టం ద్వారా నిర్ణయాత్మక అధికారాలు తహసీల్దార్‌ల చేతుల్లో ఉంచటం అత్యంత ప్రమాదకరమనీ, ఈ చట్టానికి వ్యతిరేకంగా ప్రజల్ని చైతన్యపరచాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ అన్నారు. భూ హక్కు చట్టం వల్ల కలిగే నష్టాలపై బుధవారం చంద్ర రాజేశ్వరరావు వికాసకేంద్రంలో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రముఖ న్యాయవాది, జనసేన నేత మత్తి వెంకటేశ్వరరావు, సీపీఐ రాష్ట్ర నేత వెలగపూడి ఆజాద్ మాట్లాడుతూ, సీపీఎం నేత శీలం నారాయణరావు మాట్లాడుతూ, ఈ చట్టం చాలా ప్రమాదకరమన్నారు. సీపీఐ సీనియర్ నేత మాలెంపాటి కాంచనరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంఎల్ పార్టీనేత జన్ను జగన్, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, సీపీఐ జిల్లా కార్యదర్శి అడ్డాడ ప్రసాద్‌బాబు, రైతు సంఘాల నేతలు తదితరులు పాల్గొన్నారు.



కేశినేని శివనాథ్ (చిన్ని) దంపతుల ఆధ్వర్యంలో పూర్ణాహుతి

రాష్ట్రంలో మంచి పాలన రావాలని కేశినేని శివనాథ్ హోమాలు

వన్‌టౌన్, జనవరి 31 : రాష్ట్రంలో దుష్టపాలన పోయి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో మంచిపాలన రావాలని, ప్రజలు సంతోషంగా జీవించాలన్న సంకల్పంతో టీడీపీ సీనియర్ నేత కేశినేని శివనాథ్(చిన్ని) దంపతులు హోమాలు నిర్వహించారు. గురునానక్ కాలనీలోని అన్న క్యాంటీన్ ప్రాంగణంలో హోమాలకు బుధవారం వేదమంత్రాల మధ్య మహాపూర్ణాహుతి నిర్వహించారు. శ్రీచక్ర నవావరణార్చన, సుదర్శన హోమం, నరసింహ హోమం, ఆయుత చండీ యాగాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు నెట్టెం రఘురాం, దేవినేని ఉమా, గద్దె రామమోహన్, బుద్దా వెంకన్న నాగుల్‌మీరా, పరుచూరి అశోక్‌బాబు, తంగిరాల సౌమ్య, శావల దేవదత్, యార్లగడ్డ వెంకట్రావు, గన్నె ప్రసాద్(అన్న), అభిమానులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

డిగ్రీ మొదటి సెమిస్టర్ ఫలితాలు విడుదల

మచిలీపట్నం టౌన్, జనవరి 31 : కృష్ణావిశ్వవిద్యాలయం నిర్వహించిన డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షా ఫలితాలను బుధవారం ఉపకులపతి ఆచార్య జి.జ్ఞానమణి విడుదల చేశారు. ఈ సందర్భంగా జ్ఞానమణి మీడియాతో మాట్లాడారు. 6773 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 3715 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. 54.85 ఉత్తీర్ణతా శాతం ఉందన్నారు. డిసెంబరులో పరీక్షలు నిర్వహించి జనవరిలో ఫలితాలు విడుదల చేశామన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ పి.వీరబ్రహ్మచారి, పరీక్షల నియంత్రణాధికారి కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో అవరోధాలు తొలగిస్తాం

పామర్రు, జనవరి 31 : ఖరీఫ్ ధాన్యం కొనుగోలులో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందుల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మ అన్నారు. బుధవారం పామర్రు రైతు భరోసా కేంద్రంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను స్థానిక ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా తుపాను వల్ల రంగుమారి దెబ్బతిన్న ధాన్యం కొనుగోలులో రైతుల ఇబ్బందులను ఆమె దృష్టికి తీసుకువచ్చారు. కొనుగోలులో ధరల భారం రైతులపై పడకుండా చూడాలని కోరారు. తుఫాన్ సమయంలో ఆఫ్‌లైన్ పద్ధతి ద్వారా సేకరించిన ధాన్యం తక్షణమే ఆన్‌లైన్ చేసి రైతులకు నగదు ఇప్పించాలని, రవాణాకు అవసరమైన వాహనాలను వెంటనే సమకూర్చాలని జేసీ దృష్టికి తీసుకువచ్చారు. రైతుల ఇబ్బందుల పరిష్కారానికి తక్షణం చర్యలు తీసుకుంటానని, అధైర్య పడవద్దని జేసీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సివిల్ సప్లయిస్ డీఎం డి.రాజు, డిఎస్‌వో పార్వతీ తహసిల్దార్ వి.భరత్‌రెడ్డి, రైతులు, ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.



ఆర్బీకేలో రైతుల సమస్యలు తెలుసుకుంటున్న జేసీ

మినీ డీఎస్సీతో నిరుద్యోగులకు అన్యాయం

▸ డీఎస్సీ అభ్యర్థుల నిరసన

అవనిగడ్డ, జనవరి 31 : అధికారంలోకి వచ్చిన తర్వాత ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయకుండా.. కేవలం ఆరువేల పోస్టులతో డీఎస్సీ వేసి జగన్ ప్రభుత్వం నిరుద్యోగులకు తీరని అన్యాయం చేస్తున్నదని అవనిగడ్డలో డీఎస్సీ శిక్షణ పొందుతున్న విద్యార్థులు బుధవారం ఆందోళన చేపట్టారు. అవనిగడ్డ వంతెన సెంటర్‌లో రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ మినీ డీఎస్సీ వద్దు.. మెగా డీఎస్సీ కావాలని నిరుద్యోగులు నినదించగా, వారికి తెలుగుదేశం పార్టీ మద్దతు తెలిపింది. ఐదేళ్లపాటు నిరుద్యోగులను ఆశపెట్టి నేడు కేవలం ఆరువేల పోస్టులు మాత్రమే భర్తీ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవటం అన్యాయమని, వెంటనే రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులన్నింటికి నోటిఫికేషన్ విడుదల చేయాలని విద్యార్థులు డిమాండ్ చేశారు.



అలంకారప్రాయంగా ట్యాబ్‌లు

మోపిదేవి, జనవరి 31 : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పంపిణీ చేసిన ట్యాబులు పాఠశాలల్లో విద్యార్థుల వద్ద అలంకార ప్రాయంగా మిగిలాయి. 8వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం ట్యాబులు పంపిణీ చేసి బైజూస్ యాప్ ద్వారా కంటెంట్ అందించి పాఠ్యాంశాల బోధన ప్రవేశపెట్టింది. 20 రోజుల క్రితం 8వ తరగతి విద్యార్థులకు ట్యాబులను గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలో ప్రజాప్రతినిధులచే పంపిణీ చేశారు. అయితే వాటికి అవసరమైన కంటెంట్.. క్యూఆర్ కోడ్ స్కానర్, మెమోరీ కార్డు వంటి ఇతర వసతులు అందించలేదు. దీంతో విద్యార్థులు వాటిని ఆటలకు, ఇతరత్రా అవసరాలకు వినియోగించుకుంటున్నారు. ట్యాబ్‌లకు కోట్లాది రూపాయలు వెచ్చించి వాటికి అవసరమైన సౌకర్యం కల్పించటంలో ప్రభుత్వం విఫలమైందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

బాలసాయిలో క్యాంపస్ సెలక్షన్స్

మచిలీపట్నం టౌన్ : మచిలీపట్నం బాలసాయి డిగ్రీ కళాశాలలో ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీ టాటా కన్సెల్టెన్సీ సర్వీసెస్ బుధవారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలలో కళాశాలకు చెందిన 31 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. సదర్‌ల్యాండ్ గ్లోబల్ సర్వీసెస్ నిర్వహించిన క్యాం పస్ ఇంటర్వ్యూలో 35 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయినట్టు కళాశాల ప్రిన్సిపాల్ వి.జగదీష్‌బాబు తెలిపారు.



వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో విశ్వభారతి విద్యార్థి

గుడివాడ : ఇటీవల హైదరాబాద్ అష్టలక్ష్మీ దేవాలయంలో కూచిపూడి కళాకారులు శివపంచాక్షరి ప్రదర్శించగా, తమ విద్యార్థి మాజేటి వాగ్మిశ్రీ పాల్గొని వండర్ బుక్ ఆఫ్ రికార్డు స్థానం సాధించిందని విశ్వభారతి పాఠశాల ఛైర్మన్ పొట్లూరి శ్రీమన్నారాయణ తెలిపారు. విశ్వభారతి పాఠశాలలో వాగ్మిశ్రీని బుధవారం ఆయన ప్రత్యేకంగా అభినందించారు. వాగ్మిశ్రీకి పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు.



ముగ్గురు తహసీల్దార్ల బదిలీ

కోడూరు/నాగాయలంక/ఘంటసాల : ఎన్నికల నేపథ్యంలో కోడూరు, నాగాయలంక, ఘంటసాల తహసీల్దార్లు తూర్పుగోదావరి జిల్లాకు బదిలీ అయ్యారు. కోడూరు తహసీల్దార్ ఎస్.కె.లతీఫ్ రాజమహేంద్రవరానికి, నాగాయలంక తహసీల్దార్ జె.వి మలకుమారి, ఘంటసాల తహసీల్దార్ బి.రామానాయక్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు బదిలీ అయ్యారు.

పోలీస్.. పక్షపాతం

(5వ పేజీ తరువాయి)

కార్యకర్తను చెంపపై కొట్టడంతో ఉద్రికత్త చోటుచేసుకుంది. ఈ వ్యవహారంలోనూ పోలీసులు ఎవరిపై చర్య తీసుకోలేదు.

చంద్రబాబు పర్యటనలోనూ..

జడ్ ప్లస్ కేటగిరీ భద్రత ఉన్న చంద్రబాబు పర్యటనలోనూ పోలీసుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపించింది. 2023, ఏప్రిల్ 13న చంద్రబాబు పర్యటన నేపథ్యంలో స్థానిక శరత్ థియేటర్ వద్ద వైసీపీ జెండాలను కట్టుకుని సుంకర శ్యామ్ అలియాస్ పెద్ద ఆవు టీడీపీ నాయకులపై కవ్వింపు చర్యలకు పాల్పడ్డాడు. టీడీపీని, నాయకులను తిడుతూ హల్‌చల్ చేశాడు. మాగంటి బాబు అనుచరులు అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య బాహాబాహీ జరిగింది. ఈ వివాదాన్ని పోలీసులు చూసీచూడనట్టుగా వదిలేశారు.

- ఈనెల 18వ తేదీన స్థానిక బైపాస్ రోడ్డులోని టీడీపీ కార్యాలయం నుంచి ఎన్టీఆర్ స్టేడియానికి బయల్దేరిన టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెనిగండ్ల రాము ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులను పోలీసులు అడ్డుకున్నారు. వాహనాలకు అడ్డుగా పోలీసులు పెట్టిన బారికేడ్లను టీడీపీ శ్రేణులు తోసివేశారు. దీంతో అసహనానికి గురైన వన్‌టౌన్ సీఐ ఇంద్ర శ్రీనివాసరావు టీడీపీ కార్యకర్తపై లాఠీతో విరుచుకుపడ్డారు. స్థానిక కొత్త మున్సిపల్ కార్యాలయం వద్ద అన్నదాన కార్యక్రమం దగ్గర ఉన్న ఎమ్మెల్యే నాని తన అనుచరులను టీడీపీ ర్యాలీపైకి ఉసిగొల్పారు. దీంతో నాని ముఖ్య అనుచరులు వల్లూరుపల్లి సుధాకర్, గుడ్లవల్లేరు బాబ్జీ తమ అనుచరులతో కలిసి ఒక్కసారిగా టీడీపీ ర్యాలీపైకి దాడికి తెగబడేందుకు ప్రయత్నించారు. ఒకదశలో వెనిగండ్ల రామును సైతం పోలీసులు అడ్డుకున్నారు.
- గుడివాడ మండలం వలివర్తిపాడులోని రీసర్వే నెంబర్ 180లోని రూ.కోట్ల విలువైన మధ్యతరగతి వారికి చెందిన 60 మందికిపైగా చెందిన ప్లాట్లను కబ్జా చేశారు. ఈ వ్యవహారంలో నాని ముఖ్య అనుచరుడిపై తాలుకా పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైనా.. దర్యాప్తు ఇంచు కూడా ముందుకు సాగలేదు.

జనసేన ఫ్లెక్సీలే తొలగించారు..

వైసీపీవి వదిలేశారు..

విజయవాడ కృష్ణలంకలో వైసీపీ ఏర్పాటుచేసిన సిద్ధం ఫ్లెక్సీలకు పోటీగా జనసేన నాయకులు మేమూ సిద్ధమే.. అంటూ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఈ వివాదం ముదిరి రెండుపక్షాల నడుమ ఘర్షణకు దారితీయడంతో పోలీసులు జోక్యం చేసుకుని జనసేన ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలు తొలగించి, వైసీపీవి అలాగే ఉంచారు.



కౌతవరంలో టీడీపీలో చేరిన వారితో వెనిగండ్ల రాము



ఐదుగుళ్లపల్లిలో బాబు ష్యూరిటీ కరపత్రాలు అందజేస్తున్న కాగిత కృష్ణప్రసాద్



జరుగువానిపాలెంలో బాబు ష్యూరిటీ కరపత్రాలు అందజేస్తున్న బండే

వైసీపీ పాలనపై ప్రజలకు విరక్తి

● కౌతవరంలో వైసీపీ నుంచి 100 మంది టీడీపీలో చేరిక

గుడ్లవల్లేరు, జనవరి 31 : రాష్ట్రంలో జగన్ అరాచక పాలన, గుడివాడలో ఎమ్మెల్యే కొడాలి నాని ప్రవర్తనతో ప్రజలు విసిగిపోయారని గుడివాడ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ వెనిగండ్ల రాము అన్నారు. మండలంలోని కౌతవరంలో వైసీపీ నాయకులు వడ్లమూడి యుగంధర్, బీసీ నాయకుడు ఈడే కృష్ణ ఆధ్వర్యంలో 100 మంది వైసీపీ కార్యకర్తలు వెనిగండ్ల రాము, రావి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. పార్టీ కండువాలు వేసి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. మండల టీడీపీ అధ్యక్షుడు కొసరాజు బాపయ్య చౌదరి, కౌతవరం పార్టీ సీనియర్ నాయకులు వి.వి.కె.వి సుబ్బారావు, మల్లిపెద్ది సుబ్రమ్మణ్యం, మద్దాల జోజి, చిట్టిబొమ్మ నరసింహారావు, వడ్లమూడి దేశపతి, నాగన్న పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు : బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం బుధవారం వడ్లమన్నాడులో నిర్వహించారు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ వెనిగండ్ల రాము, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటటేశ్వరరావు ఇంటింకీ వెళ్లి టీడీపీ మేనిఫెస్టో వివరించారు. మండల టీడీపీ అధ్యక్షుడు కొసరాజు బాపయ్య చౌదరి, జడ్పీ మాజీ వైస్‌ఛైర్‌పర్సన్ శాయిన పుష్పావతి, నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, మండల జనసేన అధ్యక్షుడు తోట చిన్నారి, తూముపద్మజ, పేర్ని జగన్, అడపా బాబి, తూము వెంకటరత్నం, బెల్లంకొండ ఏడుకొండలు, ఈడే రామ్మోహన్, నరేంద్ర,నాంచారయ్య, వీరన్న,పెద్దిరాజులు తదితరులు పాల్గొన్నారు.

చేనేతను సంక్షోభంలోకి నెట్టారు : కాగిత

పెడన : వైసీపీ ప్రభుత్వం చేతకాని తనం వల్ల చేనేత పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోయిందని నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. మండలంలోని ఐదుగుళ్లపల్లిలో బుధవారం బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. కృష్ణప్రసాద్ మాట్లాడుతూ, అరాచక, విధ్వంసక పాలన సాగిస్తోన్న జగన్ పట్ల ఏహ్య భావంతో ఉన్న ప్రజలు అతన్ని చిత్తుగా ఓడించడం కోసం ఎన్నికలు ఎప్పుడెప్పుడు వస్తాయా అని ఎదురు చూస్తున్నారన్నారు. పోతన స్వామి, సాదరబోయిన ఏడుకొండలు, ఎస్‌ఏ బేగ్, గోపీ నాగబాబు, కాసగాని శ్రీనివాసరావు, కూనవరెడ్డి పెద్దిరాజులు, శాయన సోమయ్య, బాసంశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చేతివృత్తిదారులకు తీరని అన్యాయం

గుడివాడ : జగన్‌రెడ్డి పాలనలో చేతివృత్తిదారులు దారుణంగా నష్టపోయారని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ వెనిగండ్ల రాము అన్నారు. శ్రీనివాస సెంటర్‌లో పట్టణ స్వర్ణకారుల సంఘం ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అడ్డగోలు నిబంధనలు పెట్టి, ప్రోత్సాహకాలను ఎత్తివేయడంతో అనేక వృత్తులు కనుమరుగవుతున్నాయన్నారు. టీడీపీ, జనసేన సంకీర్ణ ప్రభుత్వంలో స్వర్ణకారులకు మేలు జరుగుతుందన్నారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మున్సిపల్ మాజీ ఛైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, అర్బన్ బ్యాంకు ఛైర్మన్ పిన్నమనేని బాబ్జీ, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, స్వర్ణకార సంఘం అధ్యక్షులు కోట నూకరాజు, ప్రధాన కార్యదర్శి మందనపు మోహన బ్రహ్మాజీ, గోల్డ్ స్మిత్ యూనియన్ నాయకులు వేముల శ్రీను, మౌళి, దుర్గా ప్రసాద్, గోపి, విశ్వబ్రాహ్మణ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు చింతలూ రి సత్యనారాయణ, రాష్ట్ర నాయకులు భవిరి శంకరనాథ్, జనసేన అధ్యక్షుడు మజ్జి శ్రీనివాస్, టీడీపీ నాయకులు సయ్యద్ మున్వర్, మహ్మమద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధి టీడీపీతోనే సాధ్యం

కోడూరు : గ్రామాభివృద్ధి టీడీపీతో సాధ్యమని కోడూరు మండల టీడీపీ అధ్యక్షులు బండే శ్రీనివాసరావు అన్నారు. బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం జరుగువానిపాలెం గ్రామంలో నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలు అందజేశారు. పోతుబోయిన శ్రీనివాసరావు, కొప్పనాతి సత్యనారాయణ, అప్పికట్ల రవీంద్ర, పిల్లి మల్లిఖార్జునరావు, ఇమ్రాన్, ఉప్పాల పోతురాజు, మేడా శివాజీ, గోగినేని సోమశేఖరరావు, బొడ్డు వెంకన్న, వీరంకి వెంకన్న పాల్గొన్నారు.

జగన్‌రెడ్డికి కౌంట్‌డౌన్ మొదలు : గోపు

మచిలీపట్నం టౌన్ : వైసీపీ నాయకుల అవినీతి అక్రమాలకు పరాకాష్ఠ అయ్యారని, జగన్‌రెడ్డికి కౌంట్ డౌన్ ప్రారంభమైందని తెలుగురైతు జిల్లా అధ్యక్షుడు గోపు సత్యనారాయణ అన్నారు. మచిలీపట్నం టీడీపీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మా ట్లాడారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో టీడీపీ నాయకులు, కార్యకర్తలపై దౌర్జన్యాలు పెచ్చుమీరాయన్నారు. ఐదేళ్లలో రైతులకు ఉపయోగపడే ఒక్క సాగునీటి ప్రా జెక్టు కూడా నిర్మించలేదన్నారు. రైతులు వైసీపీ పాలనలో అన్ని విధాలా నష్టపోయారన్నారు. టీడీపీ జిల్లా ప్రచార కార్యదర్శి పి.వి.ఫణికుమార్, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి మాజీ డైరెక్టర్ అబ్దుల్ అజీమ్ పాల్గొన్నారు. **మచిలీపట్నం టౌన్ :** మాజీ మంత్రి కొల్లు రవీంద్రపై ఎమ్మెల్యే పేర్ని నాని అనుచిత వ్యాఖ్యలు చేస్తే రానున్న ఎన్నికల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని మునిసిపల్ మాజీ ఛైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్ అన్నారు. అసెంబ్లీ నియోజకవర్గ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అవినీతి బురదలో కూరుకుపోయిన పేర్ని నాని ఆ బురదను టీడీపీ నాయకులకు అంటించాలని చూస్తున్నారని విమర్శించారు. పల్లపాటి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, మరోసారి బందరు ప్రజలను పేర్ని నాని మోసగిస్తున్నారన్నారు.

నిబంధనలు పాటించని వాటర్ ప్లాంట్లపై చర్యలు తీసుకోవాలి

● పెడన కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్ చంద్రబాబు డిమాండ్

పెడన, జనవరి 31 : మినరల్ వాటర్ ప్లాంట్‌లపై పర్యవేక్షణ లేకపోవడంతో నాణ్యమైన మంచినీరు అందడం లేదని తొమ్మిదో వార్డు కౌన్సిలర్ గరికముక్కు చంద్రబాబు అన్నారు. ఛైర్‌పర్సన్ కటకం నాగకుమారి అధ్యక్షతన బుధవారం పెడన మునిసిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. వేసవిలో ప్రజలు ఎక్కువగా వాటర్ ప్లాంట్లపై ఆధారపడతారని, అందువల్ల వేసవికి ముందే ప్లాంట్లలో తనిఖీలు నిర్వహించి వాటికి లైసెన్స్‌లు, రిజిస్ట్రేషన్లు ఉన్నదీ లేనిదీ పరిశీలించాలని ఆయన సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న వాటర్ ప్లాంట్ల నిర్వాహకులపై తగిన చర్యలు తీసుకుని, నాణ్యమైన మంచినీరు ప్రజలకు అందేలా చూడాలని ఆయన కోరారు. వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఛైర్‌పర్సన్ నాగకుమారి మాట్లాడుతూ, త్వరలో మంచినీటి అంశంపై సమావేశం నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో తాగునీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించడం జరుగుతుందన్నారు. 12 వ వార్డు జనసేన పార్టీ కౌన్సిలర్ మట్టా శివపావని మాట్లాడుతూ, తన వార్డులో రెండు నెలలుగా మంచినీటి సరఫరా సక్రమంగా జరగడం లేదని, అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆయన ఆరోపించారు. అధికారులు ప్రోటోకాల్ నిబంధనలను పాటించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్ష కౌన్సిలర్లు ప్రాతినిధ్యం వహిస్తున్న వార్డులలో కౌన్సిలర్లను కాదని వైసీపీ ఇన్‌చార్జిలతో ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహింప చేస్తున్నారని అధికారులపై మండిపడ్డారు. మాజీ ఫ్లోర్ లీడర్ కటకం ప్రసాద్ మాట్లాడుతూ, మునిసిపాలిటీ ఆర్థిక పరిస్థితి ఏమీ బాగోలేనందున చిన్న చిన్న పనులు కూడా చేపట్టలేకపోతున్నామని, పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో పన్ను బకాయిలపై ప్రత్యేక దృష్టి సారించి కొంత పురోగతి సాధించామని ఆయన పేర్కొన్నారు. ఆశీలు వసూలుకు సంబంధించిన అజెండాలోని మూడో అంశంపై జనసేన పార్టీ కౌన్సిలర్ శివపావని డిసెంట్ ఇచ్చారు. గెజిట్‌లో ఆశీల రేట్లు ఎక్కువగా నిర్ణయించడం వల్ల వ్యాపారులు, ప్రజలు నష్టపోతారని ఆమె తన డిసెంట్‌లో పేర్కొన్నారు.





సాగరమాత మహోత్సవాల్లో పూజాబలి నిర్వహిస్తున్న ఖమ్మం డయాసిస్ బిషప్ ఎమెరిటూస్ మైపాన్‌పాల్, గురువులు

మానవాళికి దిక్సూచి మరియమాత

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : మానవాళిని దేవునివైపు నడుపుతున్న దిక్సూచి మరియమాత అని ఖమ్మం డయాసిస్ బిషప్ ఎమెరిటూస్ మైపాన్‌పాల్ అన్నారు. శారదానగర్ ఆర్‌సీఎం విచారణ చర్చిలో సాగరమాత మహోత్సవాలను పురస్కరించుకుని బుధవారం ప్రత్యేక దివ్య పూజాబలి సమర్పించారు. మరియమాత భక్తులకు, దేవుడికి మధ్య వారధిలా, భక్తుల కోరికలు తీర్చే కల్పవల్లిగా కొనియాడబడుతోందన్నారు. ప్రతిఒక్కరూ సన్మార్గంలో నడచి ఇతరులకు మార్గదర్శకులుగా ఉండాలన్నారు. శారదానగన్ సాగరమాత విచారణ గురువు జానీ డిక్రూస్, 20 మందికి పైగా విచారణ గురువులు పూజాబలిలో పాల్గొన్నారు. నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి పేర్ని కిట్టు, జనసేన ఇన్‌చార్జి బండి రామకృష్ణ, డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఖమ్మం డయాసిస్ బిషప్‌ను ఘనంగా సత్కరించారు. సాగరమాత విచారణ పరిధిలోని శారదానగర్, చిన్నాపురం, రుద్రవరం, పెదయాదర, కాలేఖాన్‌పేట, వాడగొయ్యి, సింహచలం తదితర గ్రామస్తులు, హోలీ క్రాస్‌చర్చి, నిర్మలా కాన్వెంట్ సిస్టర్లు పాల్గొన్నారు.మేరీమాత తేరు ప్రదక్షిణను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం : మండలి

ఘంటసాల : క్రీస్తు బోధనలు అనుసరణీయమని మాజీ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్ పేర్కొన్నారు. తెలుగురావుపాలెం ఆర్‌సీఎం చర్చి ప్రతిష్ఠ, జనవరి పండుగలో బుధవారం ఆయన పాల్గొన్నారు. ఫాదర్ జాకబ్ ప్రసాద్ దివ్య బలి పూజ నిర్వహించి విశ్వాసులకు క్రీస్తు సందేశాన్ని అందించారు. ఫాదర్ జాకబ్ ప్రసాద్‌ను సంఘ పెద్దలు, విశ్వాసులు ఘనంగా సత్కరించారు. మండల టీడీపీ అధ్యక్షుడు తుమ్మల చౌదరి బాబు, సర్పంచ్ రాచూరి ప్రసాద్‌బాబు, ముప్పనేని రవిప్రసాద్, పైడిపాముల కృష్ణకుమారి, తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా), మాజీ సర్పంచ్ ఆరుంబాక రవి, గ్రామ పెద్దలు రాచూరి పెద్ద బాబురావు, పెదముత్తేవి వసంతరావు, చాట్రగడ్డ చిన్ని, ఆరుంబాక రవి, రాచూరి భాస్కరరావు, మునిపల్లి నాగమల్లేశ్వరరావు, పెదపూడి దేవ సహాయం, తలకటూరి దాసు, మట్టా శేఖర్, జుజ్జువరపు కోటేశ్వరరావు, బుర్రే నాగమల్లేశ్వరరావు, ఉపదేశి బేబీ సరోజిని పాల్గొన్నారు.

సర్వమానవాళికి ప్రభువు ఆశీస్సులు : కొడాలి

గుడివాడ : ఏసు ప్రభువు ఆశీస్సులు సర్వమానవాళికి ఉండాలని ఎమ్మెల్యే కొడాలి నాని ఆకాంక్షించారు. విక్టరీ బాప్టిస్టు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ స్టేడియంలో బుధవారం క్రీస్తు సువార్త సభల ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఏసు ప్రభువు ఆదేశించినట్లు రూ.2.50 లక్షల కోట్ల నిధు లను ప్రభుత్వ ఖజానా నుంచి పేదలకు నేరు గా అందించిన వ్యక్తి జగన్మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. అసోసియేషన్ కన్వీనర్ పండు మద్దాలి, ఆర్గనైజర్లు శ్యాంబాబు, సువర్ణబాబు, అప్పికట్ల జాషువా, దైవసేవకులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల పీడీ సత్యనారాయణకు సత్కారం



మోపిదేవి : ఉద్యోగ విరమణ చేస్తున్న మోపిదేవి బీసీ బాలుర గురుకుల పాఠశాల వ్యాయామోపాధ్యాయుడు కె.వి.సత్యనారాయణ దంపతులను పాఠశాల ఆవరణలో బుధవారం ఘనంగా సత్కరించారు. విశిష్ట సేవలతో ఎంతో మంది విద్యార్థులను క్రీడాకారులుగా సత్యనారాయణ తీర్చిదిద్దారని గురుకుల పాఠశాలల సొసైటీ రాష్ట్ర కార్యదర్శి కృష్ణమోహన్ కొనియాడారు. పూర్వ విద్యార్థులు, వ్యాయామోపాధ్యాయులు, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ఎడ్విన్, ముక్తేశ్వరరావు, ప్రిన్సిపాల్ కె.వీరరవి, ఉపాధ్యాయులు సత్యనారాయణ దంపతులను పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.

ఎంపీడీవో స్వర్ణలతకు సత్కారం

తోట్లవల్లూరు : ఎన్నికల నిబంధనల్లో భాగంగా పశ్చిమగోదావరి జిల్లాకు బదిలీ అయిన ఎంపీడీవో టి.స్వర్ణలతకు బుధవారం మండల పరిషత్ పాలకవర్గం సత్కరించి వీడ్కోలు పలికింది. నాలుగున్నరేళ్లుగా మండలానికి అందించిన సేవలను గుర్తుచేస్తూ శాలువ, పూలమాలలతో స్కరించారు. ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి, జడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు సర్పంచ్‌లు, సిబ్బంది, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి జనసేన ఆర్థిక సాయం



మచిలీపట్నం టౌన్ : ప్రమాదంలో కాళ్లు, చేతులు కోల్పోయి మంచానికే పరిమితమైన గరాలదిబ్బ గ్రామానికి చెందిన అంద్రాజు ఏసుబాబుకు బుధవారం జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ రూ. 10 వేల నగదు, నిత్యావసర వస్తువులు అందజేశారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల జరిగిన ప్రమాదంలో పేద కార్మికుడైన ఏసుబాబు మంచానికి పరిమితమయ్యాడు. బాధిత కుటుంబానికి ఉపాధి కల్పించి ప్రభుత్వం ఆదుకోవాలని రామకృష్ణ కోరారు. మత్స్యకార సంఘ నాయకుడు మోకా రవి, జనసేన నగర అధ్యక్షుడు గడ్డం రాజు, కూనపరెడ్డి ప్రసాద్, వేముల చక్రి, బొడ్డు శివాజీ, తిరుమలశెట్టి ప్రసాద్, వడుగు పవన్, శాయన శివ, సుదర్శన్, మణిబాబు తదితరులు పాల్గొన్నారు. గరాలదిబ్బలో తిరుమలశెట్టి నాగమల్లేశ్వరరావు, దుర్గారావుల ఇంటి నిర్మాణం కోసం బండి రామకృష్ణ రూ. 20 వేలు అందజేశారు. శారదానగర్‌లో సాగరమాత ఉత్సవాలకు రూ.50 వేల విరాళం అందజేశారు. ఆయనకు మత పెద్దలు ఆశీస్సులు అందజేశారు.

జల్‌జీవన్ మిషన్ ఓవర్‌హెడ్ ట్యాంకు ప్రారంభం



గుడివాడ రూరల్ : చౌటపల్లి గ్రామంలో రూ.61.52 లక్షల జల్ జీవన్ మిషన్ నిధులతో నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంకును ఎమ్మెల్యే కొడాలి నాని బుధవారం ప్రారంభించారు. పంపు హౌస్ రూమ్‌ను సర్పంచ్ వెలగలేటి రమ్య ప్రారంభించారు. ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలతో కలసి శిలాఫలకాన్ని ఎమ్మెల్యే కొడాలి నాని ఆవిష్కరించారు. జడ్పీటీసీ సభ్యుడు గోళ్ల రామకృష్ణ, ఎంపీపీ గద్దె పుష్పరాణి, వైస్ ఎంపీపీ బట్టు నాగమల్లేశ్వరి, మార్కెట్ యార్డు ఛైర్‌పర్సన్ మట్టా నాగమణి, తహసీల్దార్ ఆంజనేయులు, ఎంపీడీవో వెంకట రమణ, జాన్ విక్టర్, బట్టు మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మెహెర్ బాబా అమరతిథి

చల్లపల్లి : అవతార్ మెహెర్ బాబా 55వ అమరతిథిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం 9.30 గంటలకు సంకీర్తన అనంతరం బాబా సెంటరులో పతాకావిష్కరణ జరిగింది. బాబా మందిరంలో చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. మద్దాలి దుర్గాప్రసాద్ ప్రసంగించారు. బాబా సెంటర్ అధ్యక్షులు చుండూరి మెహెర్, విఆర్‌కె.ఎస్‌వి.ప్రసాద్, కార్యదర్శి పి.వి.రమణారావు, కాకరపర్తి సురేష్, నంబూరి వెంకట చలపతిరావు, కె.సులోచన, దాలిపర్తి మెహెర్, ఎంపీటీసీలు మేకా బంగారు బాబు, మోపిదేవి ద్వారకా నాథ్ తదితరులు పాల్గొన్నారు.

మండల కార్యాలయంలో డిప్యూటీ సీఈవో తనిఖీలు

అవనిగడ్డ రూరల్ : మండల పరిషత్ కార్యాలయాన్ని జడ్పీ డిప్యూటీ సీఈవో గంజి శ్రీనివాసరావు బుధవారం తనిఖీ చేశారు. వివిధ అభివృద్ధి పనుల నిమిత్తం రూ.16 లక్షల నిధులు కేటాయించినట్లు తెలిపారు. ఎంపీడీవో మరియదేవి ఆధ్వర్యంలో జడ్పీ డిప్యూటీ సీఈవో శ్రీనివాసరావును ఘనంగా సత్కరించారు. ఎంపీపీ తుంగల సుమతిదేవి, మండల పరిషత్ ఉద్యోగులు పాల్గొన్నారు.

మరోసారి ఇసుక తవ్వకాలకు అడ్డుకట్ట

ఘంటసాల : శ్రీకాకుళం సమీపంలోని కృష్ణానదిలో రాత్రి వేళల్లో అక్రమ ఇసుక తవ్వకాలను మంగళవారం రాత్రి టీడీపీ, జనసేన పార్టీ నేతలు అడ్డుకున్నారు. సోమవారం రాత్రి అడ్డుకున్నప్పటికీ మరలా తవ్వకాలు జరుపుతున్న విషయం తెలిసి మరోసారి అడ్డుకున్నారు. వాహనాలు రేవు నుంచి బయటకు వచ్చే వరకు నిరసన తెలిపారు. శ్రీకాకుళం ఎంపీటీసీ సభ్యుడు తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా) మాట్లాడుతూ తవ్వకాలు చేపట్టకుండా జిల్లా స్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దాసం రామకృష్ణ, వినయ్, రిచిత్, సాయి తేజ, లంకా త్రినాథ్, కటారి తాతయ్య, కొండవీటి శ్రీను, విజయ్, సోమిశెట్టి రవి, సిద్ధు పాల్గొన్నారు.